ప్రజాశక్తి

బుధవారం 11 డిసెంబర్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

జిల్లా అభివృద్ధి ప్రణాళిక సిద్ధం

నేడు, రేపు కలెక్టర్ల సమావేశంలో చర్చ - వివరించనున్న కలెక్టర్ నాగలక్ష్మీ



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న స్వర్ణాంధ్ర-2047 అమలుకు జిల్లా స్థాయిలో ప్రణాళిక సిద్ధమైంది. జిల్లాలో సుస్థిర అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించి కలెక్టర్ల సమావేశంలో గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. బుధ, గురువారాల్లో వెలగపూడి సచివాలయంలో జరగనున్న రాష్ట్ర స్థాయి జిల్లా కలెక్టర్ల రెండ్రోజుల సమావేశంలో పాల్గొనున్న వారిలో సంబంధిత ప్రణాళికలపై రాష్ట్రంలోని ఐదుగురు కలెక్టర్లను ప్రభుత్వం ఎంపిక చేసింది. వీరిలో గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, అనకాపల్లి, కాకినాడ జిల్లాల కలెక్టర్లున్నారు. వీరంతా ఆయా జిల్లాలకు సంబంధించిన ప్రణాళికలను ప్రభుత్వానికి సమర్పించిన తరువాత వీటిల్లో అత్యంత మెరుగ్గా ఉన్న ప్రణాళికలను ఎంపిక చేసి ముగ్గురు కలెక్టర్లకు అవకాశం ఇస్తారు. వీరిలో సీనియర్ కలెక్టరుగా నాగలక్ష్మీకి కూడా అవకాశం వస్తుందని భావిస్తున్నారు. ఈ మేరకు ఆమె జిల్లా అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికను నివేదిక రూపంలో రూపొందించారు.

వివిధ రంగాల్లో రాష్ట్ర పురోభివృద్ధికి ఏటా 15 శాతం వృద్ధి రేటు సాధించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ప్రధానంగా ప్రాధాన్యత రంగాలైన వ్యవసాయం, పారిశ్రామిక, సేవారంగాల్లో ఏటా 15 శాతం వృద్ధి రేటుతో ఐదేళ్లలో 100 శాతం (రెట్టింపు) పురోగతి సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ప్రణాళికలపై ప్రజల నుంచి సలహాలను కూడా స్వీకరించారు. జిల్లాలో 59 వేల మంది ఆన్‌లైన్ ద్వారా తమ సలహాలను పంపారని జిల్లా అధికారులు తెలిపారు. అవినీతి రహిత, జవాబుదారి తనం ఉండేలా పాలన కావాలని ఎక్కువ మంది కోరారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంటేషన్ రూపకల్పనకు గ్రామ, వార్డు స్థాయిలోనే ప్రజల అవసరాలు, సౌకర్యాలు, సమస్యల పరిష్కారం, అభివృద్ధికి సంబంధించిన నిధులతో కూడిన ప్రణాళికలు రూపొందించాలని వీటన్నింటిని జిల్లా స్థాయిలో తుదిరూపు ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది.

వ్యవసాయ అనుబంధ రంగాలు, ఉద్యాన, మత్స్య, పాడి పంటలు, ఆక్వా, పట్టు పరిశ్రమలకు సంబంధించిన రంగాలపై కూడా ఎక్కువగా పురోగతి సాధించేందుకు ఉన్న అవకాశాలపై కూడా దృష్టి సారించారు. జిల్లాలో పట్టణ ప్రాంతాలు ఎక్కువగా ఉండటం వల్ల ఆయా పట్టణాల్లో మౌలిక వసతులు, ఎంఎస్ఎంఇల ఏర్పాటు, వ్యాపార వాణిజ్య రంగాల్లో ఉపాధి, పారిశ్రామికంగా జిల్లాలో ఉన్న వనరులను వినియోగించుకోవడంపై ప్రణాళికలో దృష్టి పెట్టారు. నిరుద్యోగ యువత ఎక్కువగా ఉండటంతో నైపుణ్య శిక్షణ, ఎంఎస్ఎంఇ కేంద్రాలను పెంచాలని నిర్ణయించారు. రాజధాని నగరంతో పాటు గుంటూరు, మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌లలో వివిధ రంగాలలో అభివృద్ధిపై దృష్టి సారించనున్నారు. ప్రధానంగా రాజధాని అమరావతి పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధితో పాటు పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన పారిశ్రామికీకరణను ప్రణాళికలో చేర్చారు.



స్వాధీనం చేసుకున్న యంత్రాల వద్ద అధికారులు

ఇసుక అక్రమ తవ్వకాలు

అంబడిపూడి, మల్లాదిలో భారీగా యంత్రాలు స్వాధీనం చేసుకున్న విజిలెన్స్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నిబంధనలకు విరుద్ధంగా పల్నాడు జిల్లాలోని పలు రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. కొంత కాలంగా మైనింగ్ అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తుండటంతో అధికారులు అక్రమ వ్యాపారులు యథేచ్ఛగా తవ్వకాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విజిలెన్స్ డైరక్టర్ జనరల్ ఆదేశాల మేరకు విజిలెన్సు బృందాల మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి. విజిలెన్సు, రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కలిసి అచ్చంపేట మండలం అంబడిపూడి, అమరావతి మండలం మల్లాది రీచ్‌లను పరిశీలించారు. అంబడిపూడిలో ఐదు భారీ యంత్రాలు, మూడు లారీలు, 360 టన్నుల ఇసుక డంప్ స్వాధీనం చేసుకున్నామని ఉమ్మడి గుంటూరు జిల్లా విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంట్ ప్రాంతీయ అధికారి డి.సూర్య శ్రావణ్‌కుమార్ తెలిపారు. మల్లాది రీచ్‌లో మరో నాలుగు భారీ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత అధికారుల నుంచి అనుమతులు లేకుండా నదీ గర్భంలో భారీ మెషిన్‌లతో ఇసుక అక్రమ తవ్వకాలు రెండుచోట్ల జరుగుతున్నట్లు వెల్లడైందన్నారు. ఈ కార్యకలాపాలు సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ఆదేశాలను ఉల్లంఘించడమేనని చెప్పారు. స్వాధీనం చేసుకున్న యంత్రాలు, లారీలను అచ్చంపేట, అమరావతి పోలీస్‌స్టేషన్‌లకు అప్పగించామని, క్రిమినల్ కేసుల నమోదు కోసం ఫిర్యాదులు చేశామని శ్రావణ్‌కుమార్ తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ సిఐలు కె.చంద్రశేఖర్, పి.శివాజి మైనింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల తనిఖీ పూర్తి 2లో



జిందాల్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మంత్రి

డంపింగ్ యార్డుల నుంచి విముక్తి

- మూడేళ్లలో అన్ని మున్సిపాల్టీల్లోనూ ఏర్పాటుకు ప్రతిపాదనలు
- జిందాల్ ప్లాంట్‌ను పరిశీలించిన మంత్రి నారాయణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో డంపింగ్ యార్డుల నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తామని మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి అనిల్ కుమార్‌రెడ్డి, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జిందాల్ ఏపీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) ఎంవి చారి, ఇతర అధికారులతో కలిసి యడ్లపాడు మండలం కొండవీడు పంచాయతి పరిధిలోని జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ని మంత్రి నారాయణ మంగళవారం పరిశీలించారు. విజయవాడ, గుంటూరు, మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్లు, సత్తెనపల్లి, నరసరావుపేట, చిలకలూరిపేట, బాపట్ల, పొన్నూరు, తెనాలి 6 మున్సిపాలిటీల్లో ఉత్పన్నమవుతున్న వ్యర్ధాలు, డంపింగ్ యార్డ్‌ల సమస్యకు ఈ ప్లాంట్ వల్ల శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. 2014-19 మధ్యలో ఘన వ్యర్థాల 2లో

లైంగిక దాడి కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి ప్యారీ కంపెనీ ఆవరణలో ఓ మహిళపై లైంగికదాడి కేసులో నిందితుడైన రామారావును అరెస్టు చేసి కోర్టులో మంగళవారం హాజరుపర్చినట్లు మంగళగిరి దక్షిణ మండల డీఎస్పీ సిహెచ్ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు తాడేపల్లి పోలీస్ స్టేషన్లో మంగళవారం విలేకర్లకు వివరాలు వెల్లడించారు. బాధితురాలి కొడుకుతో స్నేహంగా ఉండే నిందితుడు ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకొని మహిళపై లైంగిక దాడికి పాల్పడినట్టు డీఎస్పీ తెలిపారు. వైద్య పరీక్షలు అనంతరం ఈ నిర్ధారణకు వచ్చామన్నారు. ఘటన జరిగిన 24 గంటల్లోపు నిందితుడిని అరెస్టు చేసిన తాడేపల్లి సిఐ బత్తుల కళ్యాణ్‌రాజు, సిబ్బందిని అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ... వెనక ముసుగులో నిందితుడు



పట్టుబడిన నిందితులతో ఎస్పీ సతీష్‌కుమార్, ఇతర పోలీసు అధికారులు

పల్లెటూరి ప్రయాణికులే లక్ష్యంగా దోపిడీలు

- ఆటో డ్రైవర్ల ముసుగులో దురాగతాలకు పాల్పడుతున్న దుండగులు
- 3 ముఠాలకు చెందిన 10 మందిని అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆటో డ్రైవర్ల ముసుగులో నేరాలకు పాల్పడుతున్న 3 ముఠాలకు చెందిన 10 మందిని వేర్వేరు ప్రదేశాల్లో అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలను మీడియాకు మంగళవారం వెల్లడించారు. పట్టుబడ్డ వారిపై ఐదు కేసులు నమోదయ్యాయని, వీరి వద్ద నుంచి 15 గ్రాముల బంగారం, రూ.50 వేల నగదు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీరిపై ఇప్పటికే గుంటూరు, ప్రకాశం, పల్నాడు, విజయవాడ సిటీ జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో దొంగతనాలతో పాటు ఇతర నేరాలకు సంబంధించి కేసులున్నాయని తెలిపారు. కొన్నేళ్లుగా దొంగతనాలనే వృత్తిగా చేసుకునిన్న వీరు.. ఆటోలో ఎక్కే 50-70 ఏళ్ల వయస్సుండే పల్లెటూళ్లకు చెందిన ప్రయాణికులను ఎంచుకుని వారిని బెదిరించి, విలువైన వస్తువులు దోచుకుంటున్నారని ఆయన తెలిపారు. నిందితులందరూ గుంటూరు నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన వారుగా గుర్తించామన్నారు. తెనాలిలో ఇందుకు సంబంధించిన తొలి ఘటన వెలుగు చూసిందన్నారు. తెనాలి 3వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 2లో

లొంగిపోదామని రాగా అరెస్టు

వైసిపి నాయకుడ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి- మాచర్ల

ఓ కేసులో నిందితుడుగా ఉన్న వైసిపి నాయకుడు కోర్టులో లొంగిపోవటానికి వస్తుండగా మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దుర్గి మండలం కాకిరాలకు చెందిన వైసిపి నాయకుడు రమావత్ శ్రీనునాయక్ మాచర్ల పట్టణ కోర్టులో లొంగిపోయేందుకు వచ్చాడు. ముందస్తు సమాచారం మేరకు అప్పటికే అక్కడికి చేరిన దుర్గి పోలీసులు... శ్రీనునాయక్‌ను అదుపులోకి తీసుకుని దుర్గి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎన్నికల సమయంలో జంగమహేశ్వరపాడులో పోలీసులు సోదాలు నిర్వహించి నాటుబాంబులు, మారాణాయుధాలను గుర్తించారు. అదే గ్రామంలో జూన్‌లో నాటుబాంబు పేలడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న వైసిపి నాయకులు పూరబండి మన్నెయ్య గత నెలలో మాచర్లకోర్టులో లొంగిపోగా, ఇదే కేసులో నిందితుడుగా ఉన్న శ్రీనునాయక్ లొంగిపోయేందుకు సిద్ధపడగా పోలీసులు అరెస్టు చేశారు.



క్రీడా సామగ్రి వితరణ

ప్రజాశక్తి - అచ్చంపేట

మండలంలోని వేల్పూరు ఎస్సీ కాలనీ యువతకు క్రీడాసామగ్రిని స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అందించారు. ఫౌండేషన్ ప్రతినిధి టి.కరిముల్లాబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడా నైపుణ్యాలు పెంచుకునేందుకు స్నేహ హస్తాలు ఫౌండేషన్ సహకరిస్తుందని చెప్పారు. అందులో భాగంగా రూ.6 వేలతో వాలీబాల్, నెట్, షటిల్ బ్యాట్స్, షటిల్ నెట్, కాక్స్‌ను అందించామన్నారు. త్వరలో కాలానికి 4 సిమెంట్ బెంబీలనూ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సునీల్‌బాబు, స్థానికులు పాల్గొన్నారు.



గింజపల్లిలో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి - అచ్చంపేట : మండలంలోని గింజుపల్లిలో సదస్సు నిర్వహించడంతోపాటు 120 ఎకరాలకు వెళ్లే బాటను కొంతమంది ఆక్రమించుకున్నారనే ఫిర్యాదుపై తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్ పరిశీలించారు. ఆక్రమణ తొలగించాలంటూ తండావాసులకు సూచించారు. డిజిటల్ సంతకాలు పూర్తిచేసి వన్‌బి అడంగల్‌ను రైతులకు అందించారు. సర్వేనెంబర్ 59, 60లోని రైతులకు ఆన్‌లైన్ అడంగల్ కోసం దరఖాస్తు చేయగా రీ సర్వే ప్రకారం సర్వేలో ఉన్న రైతులకు త్వరలోనే వన్ బి అడంగల్ అందిస్తామని చెప్పారు. టిడిపి సీనియర్ నాయకుడు పాపిరెడ్డి గతంలో ప్రభుత్వం ఇచ్చిన డీకే పట్టాలకు రైతుల ఇబ్బంది గురించి వివరించారు.

జగన్ ఇంటి ముందు ఇనుప గడ్డర్ల తొలగింపు

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇంటి ముందు ఏర్పాటుచేసిన భారీ ఇనుప గడ్డర్లను మంగళవారం తొలగించారు. భద్రత కోసం గతంలో రాజుల కాలం నాటి కోటలాగా భారీ ఎత్తున ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేశారు. వాస్తు బాగాలేదని పేరుతో ఈశాన్యం వైపు కొంత భాగాన్ని తొలగించారు. గతంలో ఇంటికి గాలి, వెలుతురు సరిగా రావడం లేదని దక్షిణం వైపు కొంత భాగాన్ని తొలగించారు.

సామాజిక పింఛన్ల తనిఖీ పూర్తి

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

సామాజిక పింఛన్లు తనిఖీ 100 శాతం పూర్తి చేసినట్లు ఎంపిడిఒ ఫణికుమార్ నాయక్ తెలిపారు. మండలంలోని సచివాలయం-2 పరిధిలోని రెండోరోజైన మంగళవారమూ లబ్ధిదార్ల వివరాలను అధికారులు తనిఖీ చేశారు. వికలాంగులు, వృద్యాప్య, వితంతు ఇతర కేటగిరీల్లో అనర్హులను గుర్తించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాకొక సచివాలయంను ఎన్నుకోగా, పల్నాడు జిల్లాలో కంభంపాడు సచివాలయం-2ను ఎంపిక చేశారు. ఈ సచివాలయం పరిధిలో 505 మంది పింఛన్లు లబ్ధిదారులు ఉండగా వివిధ మండలాల నుంచి వచ్చిన అధికారులు పింఛన్లను తనిఖీలు చేశారు. ఎంపిడిఒ ఫణికుమార్ నాయక్ పర్యవేక్షణలో డిఎల్‌డిఒ గబ్రూనాయక్ ఆధ్వర్యంలో సచివాలయం పరిధిని 20 క్లస్టర్లుగా విభజించి ఒక్కో క్లస్టర్ కింద ఇద్దరు అధికారులు 40 మంది లబ్ధిదార్ల చొప్పున తనిఖీలు పూర్తిచేశారు. వారి ఫోన్ యాప్‌లో ఉన్న ప్రశ్నావళి ప్రకారం లబ్ధిదారులు నుంచి వివరాలు సేకరించి, ఆధార్ కార్డు, వైకల్య ధ్రువపత్రాలను పరిశీలించి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయం పరిధిలో తొలి రోజు 87 శాతం పింఛన్ల తనిఖీలు చేయగా రెండోరోజు 100 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. తనిఖీలు నిర్వహించిన వారిలో పలుశాఖలకు చెందిన అధికారులు పద్మజ, వెంకటేశ్వర్లు, వెంకటేష్, సురేష్ తదితరులున్నారు.



లబ్ధిదారుల నుండి వివరాలు సేకరిస్తున్న తనిఖీ బృందం

డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌లో షుగర్ రోగికి అరుదైన ఆపరేషన్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

హైదరాబాద్, విజయవాడ, గుంటూరు వంటి మహా నగరాల్లో జరిగే అరుదైన శస్త్రచికిత్స తమ హాస్పిటల్లో విజయవంతంగా చేసినట్లు డాక్టర్ డా.అంజిరెడ్డి హాస్పిటల్ అధినేత లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నరసరావుపేట పట్టణానికి చెందిన శ్రీనివాసరావు షుగర్ వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో గతంలో కాలి వేళ్లను తొలగించారు. షుగర్ నియంత్రణ కాకపోవడంతో కాలు తొలగించాలని వైద్యులు సూచించగా పలు హాస్పిటల్‌లు తిరిగి విసుగు చెంది చివరగా తమను సంప్రదించారన్నారు. డాక్టర్ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కోటా శబరిగిరీష్ పర్యవేక్షణలో 4 గంటలు పాటు కాలు యొక్క రక్తనాళాలలో స్టంట్‌లు అమర్చి, బ్లాక్‌లు తొలగించి కాలుకు రక్త సరఫరా సక్రమంగా అయ్యేలా ఆపరేషన్ చేశామని వివరించారు. ప్రస్తుతం రోగి పరిస్థితి నిలకడగా ఉందని, కాలుమీద గాయం సైతం మానుముఖం పట్టిందని చెప్పారు. పల్నాడు జిల్లాలో తొలిసారిగా పెరిఫెరల్ యాంజియోప్లాస్టి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహిండం దీనికి తమ హాస్పిటల్ వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. తమ హాస్పిటల్‌లో లాభాపేక్షకు తావు లేకుండా అనుభవజ్ఞులైన వైద్యులచే నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో అందిస్తున్న మెరుగైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని రకాల వ్యాధులతో పాటు అత్యవసర కేసులకు అన్ని వేళల చికిత్స అందిస్తామని ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకంతో పాటు అన్ని బీమా కంపెనీల నగదు రహిత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరెడ్డి, శబరి గిరీష్



సినిమా థియేటర్‌లో తహశీల్దార్ తనిఖీ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు : టిక్కెట్లను అధిక ధరలకు అమ్ముతున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులోని శ్రీమారుతి సినిమా థియేటర్‌ను తహశీల్దార్ జి.కరుణ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ధరలకు సంబంధించి జీవోలు, రికార్డులను పరిశీలించడంతోపాటు సినిమా చూస్తున్న ప్రేక్షకుల వద్దకు వెళ్లి టికెట్లను పరిశీలించారు. హాలులోని అన్ని విభాగాలనూ తనిఖీ చేశారు. పవర్ గదిలో ఖాళీగా ఉన్న బక్కెట్లను గమనించి వాటిపై తేదీలు లేకపోవడంపై ప్రశ్నించారు. అగ్నిమాపక శాఖకు దరఖాస్తు చేశామని, ఏసీకి సంబంధించి అనుమతులకూ దరఖాస్తు చేశామని థియేటర్ యజమాని చెప్పగా సంబంధిత రికార్డులతో తమ కార్యాలయానికి బుధవారం రావాలని తహశీల్దార్ ఆదేశించారు. ప్రస్తుతం టిక్కెట్ ధర రూ.20, రూ.40 మాత్రమే అమ్మాలన్నారు.

ఎమ్మెల్యే అవకాశం ఇస్తే ప్రతివిషయంపైనా వివరణకు సిద్ధం

ప్రజాశక్తి - పెదనందిపాడు

అన్నపర్రులో తనపై అధికార పార్టీలోని కొద్దిమంది చేస్తున్న అసత్య ఆరోపణలు చేస్తున్నారని వైసిపికి చెందిన ఎంపిటిసి కల్లూరి నాగేశ్వరరావు(నాగు) అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గ్రామ అభివృద్ధికి పాటుపడిన వారిపై అవినీతి పేరుతో ఆరోపణలు చేస్తూ గ్రామంలో అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, సమస్యలు పరిష్కరించలేక నిందలు వేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు నిజ నిజాలు తెలుసుకొని తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఒకవేళ తాను తప్పు చేసి ఉంటే ఎటువంటి చర్యలు తీసుకున్న సమ్మతమేనన్నారు. గతంలో చర్చించేందుకు ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లగా అదే సమయంలో గ్రామానికి చెందిన వారు ఉండడంతో ఘర్షణకు అవకాశం ఉండకూడదని వెనుతిరిగి వచ్చానని, ఎమ్మెల్యే అవకాశం ఇస్తే ప్రతి విషయంపైనా విరణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాని అన్నారు.

వర్సిటీ దినసరి ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దినసరి వేతన ఉద్యోగుల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వికాస అధ్యక్షులు నీలపు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాస రావు, సభ్యుల సమక్షంలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నూతన కార్యవర్గం సభ్యులు : అధ్యక్షులుగా యం.వి.ఎస్.ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా జె.రామకృష్ణ, బి.రత్తయ్య, యన్. రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి గా టి.నీలకంటేశ్వరరావు, సంయుక్త కార్యదర్సులుగా ఎం.శాంతిశ్రీ, టి.సుధాకర్‌బాబు, జె.వెంకటకృష్ణ, కోశాధికారిగా వి.రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎన్.వెంకటేశ్వరరావు, సిహెచ్.ఉమా మహేశ్వరరెడ్డి, సిహెచ్. నరేష్‌బాబు, మహమ్మద్ నిజాముద్దీన్, డి.నవీన్‌కుమార్, పి.నాగేశ్వరరావు, యం.శ్రీనివాసరావు, టి.పూర్ణ సురేంద్రరెడ్డిని ఎన్నుకున్నారు. వీరిని వీసీ తదితరులు అభినందించారు.

డంపింగ్ యార్డుల నుంచి విముక్తి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహణపై వివిధ రాష్ట్రాలు, దేశాల్లో అధ్యయనం చేసి ఉత్తమ విధానాలతో ఆంధ్రప్రదేశ్‌లో 10 ప్రాంతాల్లో ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయంలో భాగంగా గుంటూరులో ఈ ప్లాంటును ఏర్పాటు చేశామన్నారు. రాబోయే మూడేళ్లలో అన్ని మునిసిపాలిటీల్లో సాలిడ్, లిక్విడ్ వేస్ట్ నిర్వహణ, తాగునీరు, రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అమత్-2, ఎఐఐబి నిధుల వినియోగంపై నిర్లక్ష్యం వలన కేంద్ర ప్రభుత్వం నుండి అందే నిధులు సక్రమంగా అందలేదని, త్వరలో వాటి సద్వినియోగంపై దృష్టి పెడతామని చెప్పారు. కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ వందల టన్నుల వ్యర్థాలను ప్రాసెసింగ్ చేస్తున్నా చుట్టు పక్కల ప్రజలకు ఏ విధమైన సమస్యా లేకుండా ప్లాంట్‌లను నిర్వహిస్తున్నారన్నారు. ప్లాంట్ నిర్వహణ సమర్ధతను గుర్తించి కాలుష్య నియంత్రణ మండలి అవార్డులను కూడా జిందాల్‌కు అందించిందన్నారు. ఇటువంటి ప్లాంట్‌లు ప్రతి జిల్లాలో నిర్మాణం చేయడం ద్వారా రోజురోజుకి పెరుగుతున్న వ్యర్ధాల నిర్వహణకు పరిష్కారం దొరుకుతుందన్నారు. పుల్లారావు మాట్లాడుతూ తడి, పొడి వ్యర్ధాలను కూడా ప్రాసెస్ చేయడం జిందాల్ ప్లాంట్ ప్రత్యేకతని చెప్పారు. కమిషనర్ మాట్లాడుతూ జిందాల్ ప్లాంట్‌కు గుంటూరు నగరపాలక సంస్థ నుండి ప్రతిరోజు సరాసరి 317 టన్నులు వ్యర్థాలను తరలిస్తున్నామన్నారు. తొలుత జిందాల్ ప్లాంట్‌లోని టిప్పింగ్ ఫ్లోర్, గ్రాప్ కంట్రోల్ రూమ్, బాయిలర్స్, ఫ్లూ గ్యాస్ క్లీనింగ్ సిస్టం, డీసిఎస్ కంట్రోల్ రూమ్‌లు, వాటి పనితీరును ఎంవి చారి వివరించారు. పరిశీలనలో గుంటూరు నగరపాలక సంస్థ సిఎంఒహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఒ డాక్టర్ రవిబాబు, ఈఈ సుందర్రామిరెడ్డి పాల్గొన్నారు.

పల్లెటూరి ప్రయాణికులే లక్ష్యంగా దోపిడీలు

(మొదటి పేజీ తరువాయి)

ఆటో డ్రైవర్లమని చెప్పుకుంటూ ఒంటరిగా ప్రయాణిస్తున్న వ్యక్తులను ఆసరా చేసుకుని వారు వెళ్లే ప్రాంతం గురించి అడిగి, తాము కూడా అక్కడికే వెళుతున్నామని వారిని ఆటోలో ఎక్కించుకొని నిర్మానుష్య ప్రదేశంలోనికి తీసుకెళ్లి బెదిరించి సొత్తు కాజేసి పరారవుతున్నారని గుర్తించామని, వీరిని విచారణ చేయగా మిగతా ఘటనలు కూడా బయటకు వచ్చాయని వివరించారు. నిందితుల్లో గుంటూరుకు చెందిన పానుగంటి వెంకటేశ్వరరావు ఒక ముఠాకు లీడర్‌గా షేక్ ఖాజా, ముడియాల సుందర్శన్‌రెడ్డి, వాల్తేరు క్రాంతి, మద్దూరి రమేష్ కలసి దోపిడీలకు పాల్పడినట్టు దర్యాప్తులో తేలిందన్నారు. బడుగు శాంసన్ అనే నిందితుడు మరో ముఠాకు లీడర్‌గా ఉండి ఎలమంచిలి రామారావు, ఒర్చు వెంకటేష్, కూరపాటి శ్రీనివాసరావులు నేరాలకు పాల్పడ్డారని తెలిపారు. పాతగుంటూరు ప్రాంతానికి చెందిన షేక్ కాలేషా కూడా ఇదే తరహాలో దోపిడీ చేసినట్టు గుర్తించామన్నారు. నిందితుల అరెస్టులో ప్రతిభ చూపిన తెనాలి త్రీటౌన్ సిఐ రమేష్, కానిస్టేబుల్స్ జయకర్‌బాబు, మురళీ, శ్రీనివాసరావు, రామకృష్ణ, నరేంద్ర, నాగశ్రీను, శ్రీ రామమూర్తికి రివార్డులు అందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి సుప్రజ, తెనాలి డిఎస్‌పి జనార్ధనరావు, స్పెషల్ బ్రాంచి డిఎస్‌పి సీతారామయ్య పాల్గొన్నారు.

ధాన్యం రైతుల్ని ఆదుకోవడంలో విఫలం : రైతుసంఘం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు సాంబిరెడ్డి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

దగా పడుతున్న ధాన్యం రైతులను ఆదుకోవటంలో ప్రభుత్వం విఫలమైందని ఆంధ్ర ప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి విమర్శించారు. తెనాలి రూరల్ మండలంలోని కంచర్ల పాలెం, సోమసుందరపాలెం, కఠెవరం గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లకు రైతులు అవసరమైన గోతాలు, రవాణా సమస్యలను పరిష్కరించాలని, తగినన్ని గోతాలను అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధాన్యం సేకరణ సమయంలో నమోదు చేసిన తేమ శాతానికి, మిల్లర్ల వద్దకు వెళ్లాక తీస్తే తేమ శాతం పెరగటం ఏమిటో రైతులకు అంతుబట్టటం లేదన్నారు. ఈనెల 12వ తేదీన మళ్లీ తుపాన్ హెచ్చరికతో రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయాన్నారు. దీన్ని ఆసరా చేసుకుని 75 కిలోల బస్తాను రూ. 1350 కే కొనుగోలు చేస్తూ రైతులను దళారులు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మార్కెట్‌యార్డులో వెయ్యికి పైగా గోతాలు ఉన్నాగానీ, గ్రామాలకు సరఫరా చేయకపోవటం అన్యాయమన్నారు. రైతులు తరుగుకు సిద్ధంగా ఉన్నా, ధాన్యం ఎత్తే దిక్కు లేకపోవటం దారుణమన్నారు. ప్రభుత్వం మాటల్లో కాకుండా చేతల్లో రైతాంగాన్ని ఆదుకోవాలని స్పష్టంచేశారు.

13న రైతు సమస్యలపై కలెక్టర్‌కు వినతి : అంబటి

ప్రజాశక్తి - కొల్లిపర : ధాన్యానికి గిట్టుబాటు ధర లేక రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని వైసిపి జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మంగళవారం కొల్లిపర మండలం తూములూరు గ్రామంలో ధాన్యపురాసులను పరిశీలించి రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మండలంలోని తూములూరు గ్రామంలో ఎంతో ఆర్భాటంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ప్రభుత్వము రైతుల పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ఏ ఒక్క రైతుకి నష్టం రానివ్వమని వాట్సాప్ లో రైతులు హాలో అంటే పలుకుతానని చెప్పటమే కానీ ఎక్కడ పలికిన దాఖలాలు లేవని విమర్శించారు. మండలంలో రైతులు సుమారు 31 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండిస్తే ప్రభుత్వం ఇప్పటివరకు 1400 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని, తెలుగుదేశం ప్రభుత్వము రైతు వ్యతిరేక ప్రభుత్వమని ఆయన ఎద్దేవా చేశారు. అన్నదాతకు అండగా ఉండేందుకు 13వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో రైతుల సమస్యలపై వినతి పత్రాలు అందజేసే కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు అన్నా బొత్తిని శివకుమార్ వైఎస్‌ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు కృష్ణాయపాలెంలో నిమ్మగడ్డ 16వ వర్ధంతి సభ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సిపిఎం నేత, మాజీ శాసనసభ్యులు నిమ్మగడ్డ రామ్మోహన్ రావు 16 వ వర్ధంతిని సందర్భంగా 12వ తేదీ ఉదయం 10 గంటలకు ఆయన స్వగ్రామమైన కృష్ణయ పాలెంలో నిమ్మగడ్డ రామ్మోహన్రావు విగ్రహం వద్ద సిపిఎం రాజధాని కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లుగా సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి తెలిపారు. కార్యక్రమంలో రాజధాని లోని సిపిఎం శ్రేణులతోపాటు, నిమ్మగడ్డ రామ్మోహన్ రావు అభిమానులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా రవి కోరారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కొల్లిపర : సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని కొల్లిపర స్టేషన్ ఎస్ఐ కోటేశ్వరావు అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ నేరాల అవగాహన వారోత్సవాల్లో భాగంగా కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామస్తులకు సైబర్ నేరాల పట్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆన్లైన్ ఆటలకు దూరంగా ఉండాలని, ఫోన్ కు వచ్చే ఓటిపి లను ఇతరులతో పంచుకోవద్దని చెప్పారు. సైబర్ నేరగాళ్లు కొత్త పోకడలతో బెదిరింపులకు పాల్పడుతున్నారని, అటువంటి ఫోన్‌లు వచ్చిన యెడల పోలీసుల కానీ 1930 నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

శ్మశాన వాటిక దారి సరి చేయండి

ప్రజాశక్తి దుగ్గిరాల : చిలువూరు గ్రామనికి చెందిన మాదిగల స్మశాన వాటిక ఆక్రమణలకు గురైనదని అధికారులు స్థల పరిశీలన చేసి ఆక్రమణలు తొలగించాలని ఎం ఆర్.పి.ఎస్ రాష్ట్ర లీగల్ సెల్ న్యాయవాది చిలువూరు నాగరాజు కోరారు. చిలువూరు గ్రామంలో మంగళవారం అతను మాట్లాడుతూ దారితో పాటు స్మశాన వాటికను కబ్జా చేశారని ఆరోపించాడు. కార్యక్రమంలో ఏటుకూరి విజయ్ కుమార్ కే శ్రీనివాసరావు వి భూషణం కే శేఖర్ ప్రసాద్ పాల్గొన్నారు.

రేపు పాలస్తీనా సంఘీభావ సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు : ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పిడిఎస్ఒ), నవయువ సమాఖ్య (ఎన్‌వైఎస్) సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12న ఉదయం 9 గంటలకు స్థానిక అరండల్‌పేట 2/5లోని వైన్‌డీలర్స్ కళ్యాణ మండపంలో 'పాలస్తీనా సంఘీభావ సభ' నిర్వహిస్తున్నట్లు ఎన్‌వైఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కే.భాష, పిడిఎస్ఒ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.భాస్కర్ తెలిపారు. మంగళవారం స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యాల యంలో సభకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరిం చారు. అమెరికా సామ్రాజ్యవాదం అండతో ఇజ్రా యిల్ గత సంవత్సరం నుండి సాగిస్తున్న మారణకాండ వల్ల 45వేల మంది పాలస్తీనియన్లు మరణించారని, ఈ మారణకాండను ఖండిస్తూ అనేక దేశాల ప్రజలు నిరసన తెలియజేస్తున్నారన్నారు. మన దేశ ప్రజలూ ఈ దాడులను ఖండించాలని కోరారు.సభలో ప్రధానవక్తలుగా కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బి.జమిందార్, ప్రజాసాహితి పత్రిక ప్రధాన సంపాదకులు కొత్తపల్లి రవిబాబు, తదితరులు పాల్గొని మాట్లాడతారని, జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్ఓ కోశాధికారి ఎల్.భాను, ఎన్.వై.ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీను, వివిశ్వతేజ పాల్గొన్నారు.

భవనం పై నుండి పడి పెయింటర్‌కు తీవ్రగాయాలు

ప్రజాశక్తి- మాచర్ల

భవనానికి రంగులు వేస్తూ ఓ పెయింటర్ భవనం పై నుండి కిందపడి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కొప్పునూరి గ్రామం లో మంగళవారం చోటుచేసుకొంది. స్థానిక 31వ వార్డుకు చెందిన పెయింటర్ పాముల సాగర్ బాబు పెయింట్ పని చేస్తూ రెండో అంతస్తు నుండి తాడు జారిపోవడంతో కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. మాచర్ల మండలం కొప్పునూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన భవనానికి రంగులు వేసేందుకు సాగర్ బాబు మరికొందరు కలిసి పని ఒప్పుకున్నారు. రంగులు వేసేందుకు వెళ్లి రెండవ అంతస్తుకు రంగులు వేస్తుండగా పరంజాకు కట్టిన తాడు జారి పైనుంచి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు పాలైన సాగర్ బాబును మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటకు తరలించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- మాచర్ల

నాగార్జునసాగర్ కుడి కాలువలో ఆదివారం స్నానానికి వెళ్ళి ప్రమాదవశాత్తు నీటిలో కొట్టుకుపోయి గల్లంతైన వ్యక్తి మృతదేహం మంగళవారం బుగ్గవాగు రిజర్వాయర్ వద్ద లభ్యమైంది. పోలీసుల తెలిపిన వివారాలు ప్రకారం. పల్నాడు జిల్లా ఈపూరు మండలం కొండ్రముట్ల పంచాయితీలోని దుష్మాన్‌పేటతండాలో నివాసం వుండే రమావత్ అశోక్ నాయక్(27) భార్య స్నేహ, వారి కుమారుడు జోహన్ కలిసి శనివారం మాచర్ల పట్టణంలోని వినాయకునిగుట్టలోని ఒక చర్చికి వచ్చారు. మరసటి రోజు ఆదివారం తిరిగి వారి ఊరు వెళ్ళటానికి ముందు రమావత్ అశోక్ నాయక్ అక్కడకి దగ్గర్లోని నాగార్జునసాగర్ కుడికాలువ వద్దకు స్నానానికి వెళ్ళాడు. స్నానం చేస్తుండగా నీటి వరవడికి కాలువలో కొట్టుకొని పోయాడు. రెండు రోజుల తరువాత బుగ్గవాగు రిజర్వాయర్‌లో అశోక్‌నాయక్ మృతదేహం లభ్యమైంది. రూరల్ పోలీసులు మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం అశోక్‌నాయక్ మృతదేహాన్ని భార్య స్నేహాకు అప్పగించారు. అశోక్ , స్నేహలకు 5 సంవత్సర క్రితం వివాహం జరిగింది. వారికి మూడు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు.

సాగర్ జలాశయంలో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జున సాగర్ జలాశయంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ తెలిపిన వివరాల ప్రకారం విజయపురిసౌత్‌లోని మేకల గొంది సమీపం లోని కృష్ణా జలాశయం వద్ద ఓ వ్యక్తి మృతదేహం కనిపించడంతో పొలాలకు వెళ్తున్న రైతులు స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇచ్చారు. ఎస్ ఐ మహమ్మద్ షఫీ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలిక

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జున సాగర్,విజయపురిసౌత్ పోలీసులు 24 గంటల వ్యవధిలోనే మిస్సింగ్ కేసును ఛేదించారు. వివరాల్లోకి వెళితే మాచర్ల మండలం చింతలతండా గ్రామానికి చెందిన జటావత్ విజయమ్మ అనే 13 సంవత్సరాల బాలిక గత సోమవారం అర్ధరాత్రి ఇంటి లో కనిపించకపోవడంతో బాలిక తల్లిదండ్రులు విజయపురి సౌత్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు.ఎస్ ఐ షేక్ మహమ్మద్ షఫీ మిస్సింగ్ కేసు నమోదు చేసి, పోలీసులు బృందాలుగా ఏర్పడి బాలిక కోసం పలు ప్రాంతాల్లో గాలించారు.తెలంగాణ ప్రాంతంలో బాలిక ఆచూకీ కనుక్కున్నారు. అనంతరం బాలికను తల్లితండ్రులకు సురక్షితంగా అప్పగించారు. 24 గంటల్లోపే బాలిక ఆచూకీ కనిపెట్టడంతో ఎస్ ఐ షేక్ మహమ్మద్ షఫీ,ఏఎస్ఐ లు సోమలా నాయక్,సోమయ్య, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

మహారాజశ్రీ నరసరావుపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ..
ఓ.ఎస్ నెం. 392/2023

దండా శ్రీనివాసరావు ..... వాది

V/s

చీమల వెంకట పుల్లారావు ......ప్రతివాది

చీమల వెంకట పుల్లారావు S/o మస్తాన్ రావు, నివాసం మూడు బొమ్మల సెంటర్, నాయుళ్ల బజారు, నకరికల్లు (పోస్ట్) మండలం, పల్నాడు జిల్లా.

To,

పైన తెలిపిన దావాలో ఇందలి వాది ప్రతివాదికి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక కాల యాపన చేయుచున్నందున శ్రీ పై కోర్టు వారు ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ నోటీసు నిమిత్తం ది.18-12-2024వ తేదీన వాయిదా వేసి ఉన్నారు. సదరు వాయిదా తేదీన ఉదయం 10:30 ని.లకు శ్రీ పైకోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదా ది. 18-12-2024

ఇట్లు.
ముత్తవరపు శ్రీనివాసరావు,
అడ్వకేట్ ,
నరసరావుపేట, 522601.
పల్నాడు జిల్లా.

బహిరంగ ప్రకటన

01. తాళ్లూరి బుచ్చయ్య తండ్రి తాళ్లూరు నారాయణ, 02. తాళ్లూరు శశిధర్ తండ్రి తాళ్లూరి సుబ్బారావు @ సుబ్బయ్య, 03.పోట్ల వీరయ్య తండ్రి వెంకయ్య, 04పొట్ల ఊర్మిల భర్త సుబ్బారావు లు కలసి జనులెల్లరకు తెలియ చేయునది. ఒకటి మరియు నాలుగుకు పట్టాదారు తండ్రియును.. మరియు రెండు నం. మనవడును, మూడు అల్లుడు అయిఉన్నాము. కాబట్టి అందరం కలిసి ఈ ప్రకటన ద్వారా తెలియ చేయునది. తాళ్ళూరి నారాయణ తేదీ 19.07.2007 లో మరణించి వున్నారు. ఆయన పొలంనకు సంబంధించిన పాస్ పుస్తకం నం./ఖాతా నం. 325, L.P నంబర్లు 178,183 (పాత సర్వే నం. 28- B,28-A-B-1)లు తేది:2-12-2024న పోయిఉన్నది. మేమందరం ఎంత వెతికి నను దొరక లేదు. ఈ పాస్ పుస్తకమును ఎక్కడ తాకట్టు పెట్టి ఉండలేదని, ఎవరికి హామీగా కూడా పెట్టి ఉండలేదని, లోన్లు ఇతరవి ఏమి తీసుకొని ఉండలేదని, తెలియజేయు చున్నాము. ఇది మా పూర్తి సమ్మతి. కావున ఎవ్వరికీ అయిన దొరికినను తెచ్చి ఇవ్వ గలరు. లేదా ఫోన్ చేసి తెలియ పరచ గలరు...

మా అడ్రస్ ఇంటి నం.1-5/2,
గొట్టిపాడు గ్రామం, చిలకలూరిపేట మండలం,
పల్నాడు జిల్లా.522616.
సెల్ నం.9502200112

APPENDIX IV [Rules 8(1)]
POSSESSION NOTICE - For Immovable Property

Whereas, The undersigned being the Authorized Officer of the CENT BANK HOME FINANCE LTD, Vijaywada Branch under the Securitization and Reconstruction of Financial Assets and Enforcement of Security interest Act 2002 and in exercise of powers conferred under section 13(12) read with rule 3 of the security interest (Enforcement) Rules3, 2002 issued Demand Notice Upon the Borrower's guarantors mentioned below to repay theamount to CENT BANK HOME FINANCE LTD, Vijayawada Branch within 60 days from the date of receipt of the said notice. The borrower having failed to repay the amount, notice is hereby given to the borrower and the public in general that the undersigned has taken possession of the property described herein below in exercise of powers conferred on me under section 13(4) of the said Act read with rules 8 of the said rules on the date mentioned against account. The borrowers/ guarantors in particular and the public in general is hereby cautioned not to deal with the property and any dealing with the property will be subject to the charge of the CENT BANK HOME FINANCE LTD, Vijaywada for the amount and interest thereon.

Name of the Borrower: Mr. Attipatla Krishna, S/o Attipatla Jagannadha Rao, **LAN No.: HL - 02504010001052.**

Description of the Property: All that part and parcel of the property consisting of All that the piece and parcel of an extent of 50 Sq. yards (41.806 Sq. Mt.) of undivided share in 770 Sq. yards (643.78 Sq. Mts) along with a flat No. 401 in fourth floor of SVR Enclave (East Block) Consisting of 1235Sq. ft. of common area 160 Sq. ft. of common area, 100 Sq. Ft. of parking area bearing Dr. No. 22-3-172, Survey No. 19/12 of KunchanapaliTadeplliMandalam, Mangalagiri Sub Registry, Guntur District. **As per Sale Deed Boundaries:** East: Zilla Parishad Road; West: Property of uppePunnamma; North: Property of AllaSamrajyam; South: Joint Passage. **As per Flat Boundaries:** East: Open to sky; West: Flat No 402,403 &Common Corridor; North: Open to sky; South: Open to sky.

Date of NPA: 10-09-2024, 13(2) **Notice Date:** 25-09-2024 - **Symbolic Possession:** 06-12-2024; **Amount in Demand Notice (₹): 62,04,917/-**
*** Interest & Other Charges.**

Place: Vijayawada, Authorised Officer,
Date: 09/12/2024 Cent Bank Home Finance Limited, Vijayawada.

59A-21,-8, Bobba Green Villa, 1st Floor, RR Garden, High School Road, Patamata, Vijayawada-520 010. Ph. 62320 11499, 96402 36861

గుంటూరు నగరపాలక సంస్థ
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఇ.టి. నెం. 44/2024-25. **తేది : 09-12-2024**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టుటకు గాను "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్ పద్ధతిన రిజిష్టరు కాంట్రాక్టుదారుల నుండి టెండరు కోరబడుచున్నవి. ఇతర వివరములకు www.apeprocurement.gov.in (procurement market place) వద్ద చూడవచ్చును.

"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండరు : 44/2024-25

మొత్తం పనుల సంఖ్య	: 9
అంచనా మొత్తం	: 71,36,000
పని వివరములు	: రోడ్లు, కాలువలు మరియు ఇతర పనులు
టెండరు బిడ్‌లు కనపడు తేది	: 10-12-2024 ఉదయం 10-30 గం.లకు
టెండరు బిడ్‌లు వేయుటకు ఆఖరుతేది	: 26-12-2024 సాయంత్రం 3-00 గం.లకు
టెండరు బిడ్‌లను తెరచు తేది	: 26-12-2024 సాయంత్రం 3-30 గం.లకు

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,
నగరపాలక సంస్థ, గుంటూరు.

పశుగణన 36 శాతం పూర్తి



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 21వ భారత పశుగణన కార్యక్రమం గతనె ఒకటో తేదీ నుండి నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు చెప్పారు. పశుగణన కోసం సిబ్బంది వచ్చినప్పుడు వారికి సరైన వివరాలు చెప్పి సహకరించాలని పశుపోషకులను కోరారు. రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి, ముత్తనపల్లి, సుబ్బయ్యపాలెం గ్రామాల్లో జరుగుతున్న పశుగణనను ఆయన మంగళవారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 36 శాతం, రొంపిచర్ల మండలంలో 30 శాతం సర్వే పూర్తయిందని, ఈ వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. పల్నాడు జిల్లాలోని 8 మున్సిపాలిటీలు, 28 మండలాల్లోని 526 గ్రామ పంచాయతి పరిధిలో అనుబంధ శివారు గ్రామాల్లోని అన్ని రకాల పశువులు అంటే.. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు, కుక్కలు, గాడిదలు, గుర్రాలు సంఖ్యను సేకరిస్తారని తెలిపారు. పశు సంవర్ధక శాఖకు చెందిన సిబ్బంది ఇంటింటికి తిరిగి పశువుల వివరాలు సేకరిస్తారని, పశువుల సంఖ్యతో పాటు వాటి వివరాలు, పశుపోషకుల సామాజిక ఆర్థిక వివరాలు సేకరించి, వివరాలు అదే రోజున భారత పశు గణన యాప్‌లో నమోదు చేస్తారని వివరించారు. అనంతరం వడ్డమూడివారిపాలెంలో గోకులం పథకం ద్వారా నిర్మించిన పశువుల షెడ్‌ను పరిశీలించారు. రొంపిచర్ల మండల పశు వైద్యాధికారి డాక్టర్ వంశీ ప్రసాద్ మాట్లాడుతూ ఏయే గ్రామాల్లో ఎప్పుడు పశు గణన చేస్తారో ముందస్తు సమాచారం ఇస్తామన్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో 2019 పశు గణన లెక్కల ప్రకారం నల్ల, తెల్లజాతి ఆవులు 66072, గేదెలు 467046, గొర్రెలు 469424, మేకలు 156291, పందులు 1646 ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఉపాధ్యాయుల సమస్యలపై చీఫ్‌విప్‌కు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - వినుకొండ

ఉపాధ్యాయులకు సంబంధించి తన దృష్టికి వచ్చిన కొన్ని సమస్యలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మెరుగైన విద్యావ్యవస్థ కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు సహకరించాలని ఉపాధ్యాయులను కోరారు. ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ నాయకులు ఎమ్మెల్యేను మంగళవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. పాఠశాలల పనివేళలు పెంపు, టీచర్లపై యాప్‌ల భారం తగ్గించాలన్నారు. 10 శాతానికి మించి ఉపాధ్యాయులు సెలవు పెట్టరాదనే ఆంక్షలు, 10వ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల కార్యాచరణ, విద్యార్థుల వివరాలు అపార్‌లో నమోదుతో పాటు ప్రతి నిర్ణయం అసంబద్ధగానే ఉంటున్నాయని చెప్పారు. మండలాల్లో 10 శాతానికి మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదని మండల విద్యా శాఖాధికారులు అత్యవసర సందర్భాల్లో కూడా సెలవులు ఇవ్వడం లేదన్నారు. విద్యాశాఖ నిర్ణయాలు పున:సమీక్షించాలని, ఒత్తిడి లేని వాతావరణంలో ఉపాధ్యాయులు స్వేచ్ఛగా పనిచేసేలా నిర్ణయాలు ఉండాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రవికుమార్, అజయ్‌బాబు, అప్పరాజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



జీవీ ఆంజనేయులుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



జానపద నృత్య పోటీల్లో వేల్పూరు విద్యార్థినులకు బహుమతి

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణా సంస్థ నిర్వహించే రాష్ట్రస్థాయి కళోత్సవ పోటీల్లో వేల్పూరు విద్యార్థులు ప్రతిభ చూపించారు. జానపద నృత్యం విభాగంలో ఉమ్మడి జిల్లాల వారీగా జరిగిన పోటీల్లో రెండో స్థానంలో నిలిచారు. బృందంలో నాగరోషిని, మస్తాన్‌బీ, శ్రావణి, తులసి, అక్షయ ఉండగా వీరికి గైడ్ టీచరుగా శ్రీనివాస్‌రావు వ్యవహరించారు. వీరిని హెచ్‌ఎం మహబూబ్ సుభాని, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రావు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు చలపతిరావు అభినందించారు.



ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న ఏడిఏ బి రవిబాబు

వరిలో ఎకరాకు 35 బస్తాల దిగుబడి

ప్రజాశక్తి-ఈపూరు

ఖరీఫ్ వరి దిగుబడి ఆశాజనకంగా ఉందని వినుకొండ ఎడిఎ బి.రవిబాబు అన్నారు. మండల కేంద్రమైన ఈపూరులో రైతు బూదాల సురేష్ పొలంలో మంగళవారం 5×5 మీటర్ల కొలతలతో వరిలో పంట కోత ప్రయోగం నిర్వహించగా 17.20 కిలోల పచ్చి దాన్యపు దిగుబడి వచ్చింది. దీని ప్రకారం ఎకరాకు 32-35 బస్తాల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అనంతరం ఈపూరు, కొచ్చర్ల గ్రామాల్లో వరి రైతులతో రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం సాధారణ వరికి క్వింటాళ్కు రూ.2300, 'ఎ' గ్రేడ్ రకానికి క్వింటాళ్ రూ..2,320 చొప్పున మద్దతు ధర ప్రకటించిందని చెప్పారు. తేమ 17 శాతం కంటే తక్కువ ఉండేటట్లు చూసుకోవాలని, ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలోఎఇఒలు బి.అప్పారావు, కె.కిషోర్‌కుమార్, వ్యవసాయ సహాయకులు ఎం.శేషుబాబు, బీమా పరిశీలకులు సిహెచ్ శ్రీను పాల్గొన్నారు.



ఆక్రమణల తొలగింపు పేరుతో అన్యాయం


ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని రైతు బజార్ పక్కన 47 ఏళ్ల నుంచి సైకిల్, రిక్షాలు రిపేరు చేస్తు జీవనం కొనసాగిస్తున్న బి.కోటానాయక్ దుకాణాన్ని మున్సిపల్ అధికారులు ఆక్రమణలు పేరుతో తొలగించడం అన్యాయమని సిఐటియు మండల కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు అన్నారు. దీనిపై కమిషనర్ పి.శ్రీహరిబాబుకు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. ఆక్రమణ తొలగింపులో అధికారులు ఆలోచన లేకుండా కర్కశంగా వ్యవహరించడం సరికాదన్నారు. సిబ్బందితో మాట్లాడి బాధితునికి న్యాయం చేస్తామని కమిషనర్ బదులిచ్చారు.

రగ్బీ పోటీలకు అచ్చంపేట విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - అచ్చంపేట

రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నరసరావుపేటలో జరిగిన జిల్లా స్థాయి రగ్బీ క్రీడాకారుల ఎంపికలో అచ్చంపేట జెడ్‌పి పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం సిహెచ్ కళ్యాణి మంగళవారం తెలిపారు. బాలికల విభాగంలో సందెపోగు లీలాక్షి, బాలుర విభాగంలో రమావత్ జయప్రకాష్ ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 15న ఫిరంగిపురంలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు పిఇటి ఎ.సుజాత తెలిపారు. ఎంపికైన వారిని ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, సుధారాణి, ఇన్నారెడ్డి అభినందించారు.



శంకుస్థాపన శిలా ఫలకం వద్ద అధికారులు



ఘనంగా నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ఫౌండేషన్ డే వేడుకలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఆధునిక దేవాలయం నాగార్జునసాగర్ ప్రాజెక్టు అని సాగర్ ప్రాజెక్టు గేట్స్ డిఇ మురళీధర్ అన్నారు. మంగళవారం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ శంకుస్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయపురిసౌత్‌లోని సాగర్ ప్రాజెక్టు ముఖద్వారం శంకుస్థాపన పిల్లర్, ఫౌండేషన్ స్టోన్ వద్ద నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డిఇ మాట్లాడుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ఆనాటి దేశ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పునాది రాయి 1955 డిసెంబర్ 10న వేశారన్నారు. నేడు 69 వసంతాలు పూర్తిచేసుకుని 70వ వసంతంలోకి అడుగుపెట్టినట్లు చెప్పారు. డ్యాం నిర్మాణానికి శ్రమించిన కార్మికులను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని సుమారు 22 లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు, 960 మెగావాట్ల విద్యుత్‌ను అందిస్తూ సాగర్ ప్రాజెక్ట్ అన్నపూర్ణగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో విజయ పురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ, సీఆర్పీఎఫ్ సీఐ ఖలీల్, టిడిపి అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు చౌదరి, ఇఇలు వెంకట సుబ్బయ్య, హిమబిందు, అనితశ్రీ, భారతి, ఎఎస్ఇ సోమలా నాయక్, మత్స్యకారుల సంఘం అధ్యక్షులు ఎం.అప్పలరాజు, వినయతుల్లా, పి.వీరారెడ్డి పాల్గొన్నారు.



ఆరబెట్టే యంత్రాన్ని ఎండబెడుతున్నారు..

ప్రజాశక్తి-చిలకలూరిపేట

లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ధాన్యపు ఆరబోత యంత్రం శిథిలమవుతున్నా మార్కెటింగ్ శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. 2014-15లో అప్పటి ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా వరి రైతుల అవసరాల కోసం యంత్రాలను తెప్పించింది. నియోజకవర్గ పరిధిలో తడి ధాన్యాన్ని ఆరబెట్టి వరి రైతులకు అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు రూ.18 లక్షలతో నాలుగు చక్రాల ట్రైలర్లై బిగించిన డ్రయర్, జనరేటర్లు అందుబాటులో ఉంచారు. అయితే దీనిపై రైతులకు అవగాహన కల్పించి వారికి అందుబాటులోకి తేకపోవడం, నిర్వహణ లోపం కారణంగా నిరుపయోగంగా మారింది. మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పనికిరాని స్థితికి చేరింది.

నేనూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ బాధితుణ్ణే : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

గత ప్రభుత్వం హయాంలో భూ సమస్యలు అధికమయ్యాయని వాటిని పరిష్కరించే రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని నందిగామలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తానుకూడా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ బాధితుడ్నే అన్నారు. వైసిపి ప్రభుత్వం హయాంలో తనకున్న 13 1/2 ఎకరాల భూమిలో నాలుగున్నర ఎకరాలు రాయించుకున్నారని, దాన్ని తిరిగి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవడానికి కష్టపడాల్సి వచ్చిందని వివరించారు. ఆర్డీవో రమణకాంతరెడ్డి మాట్లాడుతూ భూములు రీసర్వే జరిగిన గ్రామాల్లో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తామని చెప్పారు. బిజెపి నాయకులు కె.శంకరరావు మాట్లాడుతూ ఎన్నిసార్లు రెవెన్యూ సదస్సులు పెట్టినా సమస్యలు మాత్రం తీరడం లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.రమాదేవి, టిడిపి మండల అధ్యక్షులు ఎ.అమరేశ్వరరావు, నాయకులు ఎ.సాంబయ్య పాల్గొన్నారు.



గ్రామ రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

మూడు వంతెనల వద్ద తాగునీటి పైపులైన్‌ను షిఫ్ట్ చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులోని మూడు వంతెనల వద్ద రైల్వే శాఖ చేపడుతున్న నూతన వంతెన పనుల్లో భాగంగా జిఎంసి తాగునీటి పైప్‌లైన్ షిఫ్ట్ చేయడానికి సదరు రైల్వే అధికారులతో సమన్వయం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు జిఎంసి ఈఈని ఆదేశించారు. మంగళవారం కమిషనర్ మూడు వంతెనల వద్ద జరుగుతున్న రైల్వే వంతెన పనులు, షిఫ్ట్ చేయాల్సిన పైప్‌లైన్‌ను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణ పనులకు జిఎంసి తాగునీటి సరఫరా పైప్‌లైన్ అడ్డంకిగా ఉందని రైల్వే వారు తెలిపారని, కావున రైల్వే అధికారులతో సమన్వయం చేసుకొని షిఫ్ట్ చేయాలని ఆదేశించారు. అలాగే వంతెన పనులు పూర్తి అయ్యాక సదరు ప్రాంతంలో రోడ్డు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. పర్యటనలో ఈఈ సుందరరామిరెడ్డి, డిఈఈ కళ్యాణరావు, ఏఈ నాగవేణి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అవినీతి ఒప్పందాల వల్లే విద్యుత్ భారాలు : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ ఒప్పందంలో అవినీతి అక్రమాల కారణంగానే ప్రజలపై భారాలు పెరిగాయని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణ అన్నారు. స్థానిక స్వర్ణాంధ్రనగర్ కాలనీలో విద్యుత్ చార్జీల పెరుగుదలను వివరిస్తూ కరపత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ భావన్నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలకు లంచాలు ఇచ్చి ఆయాచిత లబ్ధి పొందేందుకు కార్పొరేట్ శక్తులు ఇలాంటి చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి ఒప్పందాలన్నీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా అదానీపై ఇలాంటి ఆరోపణలే వచ్చినా కేంద్రప్రభుత్వ పెద్దల అండదండలు ఉండడంతో ఎలాంటి విచారణ జరగలేదని, ప్రస్తుతం అమెరికన్ ప్రభుత్వమే కేసు నమోదు చేయడంతో మన దేశ ప్రతిష్ట మసకబారిందని అన్నారు. అదానీ విదేశీబొగ్గును 10శాతం కొనాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు షరతు పెట్టిందని, ఎక్కువ ధరకు కొన్న కారణంగా విద్యుత్ ఛార్జీలు పెరిగి ఆభారం ప్రజలపై పడిందని తెలిపారు.


స్థానికులతో మాట్లాడుతున్న ఎన్ భావన్నారాయణ

ప్రస్తుత వివాదాలకు కారణమైన సోలార్ విద్యుత్ ఒప్పందం కూడా అలాంటిదేనని అన్నారు. ఒకవైపున నిత్యవసర వస్తువుల సరుకులు ధరలు రోజురోజుకు పెరుగుతుంటే కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారం వేయటం తగదన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు బగాతి సత్యనారాయణ , పాలు, జానీ తదితరులు పాల్గొన్నారు.


ఐద్వా ఆధ్వర్యంలో సంతకాలు చేస్తున్న ప్రజలు

మహిళల రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు

మహిళల అభివృద్ధి, రక్షణతోనే దేశం అభివృద్ధి చెందుతుందని, మహిళల హక్కులూ మానవ హక్కులేనని ఐద్వా నగర అధ్యక్ష, కార్యదర్శులు జి.రమణ, ఎ.కళ్యాణి అన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక శంకర్ విలాస్ సెంటర్‌లో మహిళలు, బాలికలపై దాడులు, హింసను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలు అభివృద్ధి చెందకపోతే దేశ అభివృద్ధి కూడా కుంటుపడుతుందన్నారు. దాడులు, హింసకు కారణమైన మద్యం, మత్తుపదార్థాలు, అశ్లీల వెబ్‌సైట్లను అరికట్టడంలో ప్రభుత్వాలు అలసత్వం ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు పెరిగాయన్నారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారే పలు సందర్భాల్లో మహిళల పట్ల చులకన భావంతో మాట్లాడటం వల్ల సమాజంలో మహిళలపై పట్ల చిన్న చూపు ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సమీర్, సిఐటియు నాయకులు ఖాసిం షహీద్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి : పెమ్మసాని

కనీస మద్దతు ధర ప్రకటించండి - కేంద్ర మంత్రులు గోయల్,చౌహాన్‌కు విజ్ఞప్తి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మిర్చి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని తగిన గిట్టుబాటు ధరలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. స్పైసెస్ బోర్డ్ ఆఫ్ ఇండియాలో మిర్చి విభాగం ఏర్పాటు చేయాలని, కనీస మద్దతు ధర కల్పించాలని కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, శివరాజ్ సింగ్ చౌహాన్ కు లేఖ రాశారు. గుంటూరు జిల్లాలోని మిర్చి రైతులు తీవ్ర సవాళ్ళు ఎదుర్కొంటున్నారని, అధిక భాగం దిగుబడి కోల్డ్ స్టోరేజీల్లో ఉండటంతో మార్కెట్ ధరలు గిట్టుబాటు కావడం లేదని వివరించారు. పెరుగుతున్న పెట్టుబడులు, చీడపీడల బెడద, మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో మిర్చి రైతుల జీవనోపాధి అగమ్య గోచరంగా మారిందని పేర్కొన్నారు. మిర్చి డివిజన్ ఏర్పాటు చేయడం ద్వారా ఈ సమస్యలకు పరిష్కారం చూపగలుగుతామని అభిప్రాయపడ్డారు. గుంటూరులో ఆసియాలోని అతిపెద్ద మిర్చి మార్కెట్ ఉందని, ఇది పరిశోధనలు ప్రోత్సహించడానికి కేంద్రంగా మారుతుందని వివరించారు. మిర్చి బోర్డు ఏర్పాటు ద్వారా చీడపీడల నివారణ, ఎగుమతి సౌకర్యాలు, ఆధునిక ప్రాసెసింగ్ వంటి కీలక రంగాలపై ప్రత్యేక దష్టి సారించే అవకాశం ఉందన్నారు. గుంటూరు సన్నం, తేజ వంటి అధిక విలువ కలిగిన వంగడాలను ప్రోత్సహించడానికి అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలు కలిగిన దిగుబడులు సాధించేందుకు దోహదం చేస్తుందని వివరించారు. భారత దేశ మిర్చి రంగం ఆర్థిక వ్యవస్థకు కీలకమని, సుగంధ ద్రవ్యాల ఎగుమతుల్లో మిర్చి వాటా 34 శాతం, 2023 24 సంవత్సరంలో రికార్డు స్థాయిలో 1.5 బిలియన్ డాలర్లకు ఇది చేరుకుందని పేర్కొన్నారు. ప్రపంచ మిర్చి ఉత్పత్తిలో భారతదేశం 40 శాతం వాటా కలిగి ఉందని, పది లక్షల మంది రైతులు మిర్చి పంటల సాగు చేస్తున్నారని, 20 లక్షల మందికి వ్యవసాయ కార్మికులు జీవనోపాధి కలిగి ఉన్నారని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు రాసిన లేఖలో పేర్కొన్నారు. మిర్చి ఎకరా సాగు సగటు వ్యయం 2.50 లక్షలకు చేరిందని, 2022 23 ఆర్థిక సంవత్సరం నుంచి మిర్చి ధరలు 50 శాతం పడిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, వెంటనే కనీస మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని విన్నవించారు. కౌలు రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర కల్పించడం ద్వారా దళారుల దోపిడీ నుంచి రైతులను రక్షించవచ్చని, మిర్చి రైతులకు ఆర్థిక సుస్థిరత అందించవచ్చని అభిప్రాయపడ్డారు.



బ్యాంకు రుణాలు రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం నిడమర్రు టిడ్కో గృహా లబ్ధిదారులకు బ్యాంకు రుణాల రద్దు చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బ్యాంకు మేనేజర్ల ఒత్తిళ్ళను అరికట్టాలని కోరుతూ నిడమర్రు టిడ్కో గృహాల నుండి ప్రదర్శన చేశారు. అనంతరం నిడమర్రు సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిప్యూటీ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. బాగ్యరాజు మాట్లాడుతూ బ్యాంక్ అధికారుల ఒత్తిళ్ల వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అసలే పంట పొలాలు లేక కూలీ పనులు లేక ఇబ్బందులు పడుతుంటే బ్యాంకు ల ఒత్తిళ్లు మానసిక ఆందోళనకు గురి చేస్తున్నాయని వివరించారు. ఒత్తిళ్లు ఆపాలని కోరారు.



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రాతూరులో ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు


ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని ప్రాతూరు గ్రామంలో మంగళవారం రాత్రి టిడిపి గ్రామ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా క్రిస్మస్ కేకును టిడిపి నాయకులు, క్రైస్తవ పాస్టర్లు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా అందరూ జరుపుకునే క్రిస్మస్ పెద్ద పండుగ అని అన్నారు. క్రీస్తు చూపిన బాటలోనే సర్వ మానవాళి నడవాలని ఆయన కోరారు. అనంతరం 30 మంది పాస్టర్లకు నూతన వస్త్రాలను నాయకులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, టిడిపి తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, టిడిపి గ్రామ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాసరావు,మండల మహిళా అధ్యక్షురాలు బి.కష్ణ వందన, ఏ సాంబశివరావు, బి నరసింహారావు, కే కోటేశ్వరరావు, కే రమేష్, ఎస్ భాగ్యరాజు, పి ఆంద్రియ, కోటి బాబు, పెద్ద దిబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 10వ తేదీ వచ్చినా వేతనాలు జమ కాలేదని, వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్‌కె. ఖాజావలిని కలిసి వినతిపత్రం అందచేశారు. అర్హులైన విఆర్‌ఓలకు జిఒ 154 ప్రకారం 60:40 నిష్పత్తిలో సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని, కోరారు. నాయకులు తెలిపిన సమస్యలపై స్పందించిన డిఆర్‌ఒ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విఆర్‌ఓల పదోన్నతులకు చర్యలు తీసుకుంటామన్నారు. డిఆర్‌ఒను కలిసిన వారిలో ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు ఛాంద్‌బాషా, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కరిముల్లా షాఖాదిరి, జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు పాల్గొన్నారు.


డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కూటమి గెలుపు ప్రజావిజయం

టిటిడి పాలక మండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కూటమి గెలుపుకి కృషిచేసిన కార్యకర్తలకు పార్టీ తరపున తగిన ప్రతిఫలం లభిస్తుందని టిటిడి పాలక మండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం తెనాలి పర్యటనకు వచ్చిన కృష్ణమూర్తి ని టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్ తెనాలి బస్టాండ్ వద్ద తన కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా జంగా మాట్లాడుతు తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ ప్రసాదాలు శుచి శుభ్రతతో భక్తులకు అందజేస్తున్నామని తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉచిత దర్శనాలకు ఏర్పాట్లు సక్రమంగా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ఎర్రగుంట మహేష్ బాబు, మల్లెబోయిన కొండ యాదవ్, ఈదర రమేష్ బాబు, మేడూరు భాస్కర్, అమరేంద్ర కుమార్, కొత్తపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏడవ రోజుకు సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

కోర్టు తీర్పుల ప్రకారం న్యాయంగా తమకు రావలసిన బకాయిల కోసం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు మంగళవారం నాటికి ఏడో రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రారంభించారు. దీక్షల్లో బొందలపాటి సూర్యప్రకాష్, నవనీతం, టి నాగేశ్వరరావు, ఎం సుబ్బారావు, సిహెచ్ పిచ్చయ్య కూర్చున్నారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వం చొరవ తీసుకొని కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా ఇటువంటి సమస్యలు పరిష్కరిస్తే కార్మిక వర్గంలో కూడా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్, బి అంకయ్య, వై యహెూశోవ, ఎం గురవయ్య, వై రమాదేవి, ఎస్.కె ఇమాంబి టి దుర్గారావు, భవాని, ఎం శారద, ఈ సారమ్మ, ఎం శివకుమారి, డి నాగమల్లేశ్వరి, జి అన్నమ్మ, వి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

13న వర్సిటీలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ ఈఐటి ఆధ్వర్యంలో ఈ నెల 13న ఒకరోజు జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్, విభాగాధిపతి ఆచార్య సంధ్యాకోలే తెలిపారు. యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ సదస్సును డైక్ మన్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామన్నారు. ద రోల్ ఆఫ్ ఎంబెడెడ్ సిస్టమ్స్ ఇన్ ఇన్స్ట్రుమెంటేషన్ అనే అంశంపై సదస్సు జరుగుతుందని ఆమె తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఇన్చార్జి వీసి ఆచార్య కే. గంగాధరరావు, కీలకోపన్యాసకులుగా ఏపీ విట్ ఇన్నోవేషన్ అండ్ ఇంక్ బేషన్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ అమీత్ చవాన్, గౌరవ అతిథిలుగా ఇన్చార్జి రెక్టార్ ఆచార్య కె. రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కే .వీరయ్య, విశిష్ట ఇన్నోవేటర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సాదు సాయి సందీప్, ఫిజిటెక్ కన్సల్టెన్సీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ తేజ వెనిగళ్ళ హాజరవుతారని ఆమె తెలిపారు. ఈ మేరకు మంగళవారం సదస్సు బ్రోచర్‌ను ఇన్చార్జి విసి ఆచార్య కే. గంగాధరరావు, ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కే.రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలంలు ఆవిష్కరించారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - వినుకొండ
జనసేన పార్టీ నేత ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నరసరావుపేట ఎం.వి రెడ్డి కంటి హాస్పిటల్ సౌజన్యంతో మంగళవారం పట్టణంలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు.



శాంతిబాయికి సేవాభూషణ్ పురస్కారం

ప్రజాశక్తి - విజయపురిసౌత్, మాచర్ల రూరల్
ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ డే సందర్భంగా కాకినాడ డి కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో విద్య, సాహిత్య, సేవా, కళా రంగాలతోపాటు, పలు అంశాలపై సదస్సుల నిర్వహణ, అన్నదాన కార్యక్రమాలు వంటివాటిలో చేస్తున్న సేవలకు గాను సేవాభూషణ్ పురస్కారాన్ని శాంతిబాయి అందుకున్నారు. వినియోగదారులు ఫోరం జడ్జి సత్యనారాయణ, కాకినాడ కలెక్టర్ మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని స్వీకరించారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ చైర్మన్ బి.దాస్, శ్రీనిలత, బామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే హక్కుల సాధన

ప్రజాశక్తి- సత్తెనపల్లి టౌన్
ఎందరో పోరాటల ఫలితంగానే మానవహక్కులు లభించాయని ప్రముఖ ఎముకల వైద్యనిపుణులు డాక్టర్ శ్రీధర్, సీనియర్ న్యాయవాది బత్తిన శ్రీనివాసుబాబు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులను అనుభవిస్తూ, వారి బాధ్యతలను గుర్తెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పి.వెంకటకోటయ్య, డి.శ్రీనివాస్.జి.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన

అమరావతి : గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా కోర్టు సివిల్ జడ్జి లీలావతి మాట్లాడుతూ మానవ హక్కులు జీవించే హక్కుతోనే ప్రారంభమవుతాయన్నారు.

రెవెన్యూ సదస్సుకు ఆరు అర్జీలు

ప్రజాశక్తి- వెల్దుర్తి
భూసమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ బాషా అన్నారు. మండల పరిధిలోని గుండ్లపాడు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు గ్రామస్తులు తమ సమస్యలపై తహసీల్దార్‌కు వినతులు అందించారు. సదస్సులో ఆరు దరఖాస్తులు అందాయని, వీటిని పరిశీలించి పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెట్టిపాలెంలో రెవెన్యూ సదస్సు

రెంటచింతల:
మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో మంగళవారం ఇన్చార్జి తాసిల్దార్ నగేష్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు 9 దరఖాస్తులు రాగా సర్వే చేసి కొలతలు వేయాలని కుటుంబ పెద్ద మతి చెందడంతో తమ పేరున పాస్ పుస్తకాలు మార్చాలని వినతులు అందజేశారు ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వెంకటరమణ, ఎంపీడీవో కే.సరోజిని, సహాయ హైడ్రాలజిస్ట్ వి శ్రీనివాసరావు, వీఆర్వో పాపారావు తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపాడు గ్రామంలో..

వెల్దుర్తి: గుండ్లపాడు గ్రామంలోని గ్రామ సచివాలయంలో తహసీల్దారు ఎస్కే బాషా ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

సమగ్ర యాజమాన్య చర్యలతో తెగుళ్ల నివారణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరిలో పాముపొడ (మాగుడు) తెగులును గుర్తించినట్లు నరసరావుపేట మండల వ్యవసాయ శాఖ అధికారి వి.నరేంద్ర బాబు అన్నారు. నరసరావుపేట మండలంలోని గురువాయపాలెం గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వరి పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వరి పంటలో పాము పొడ తెగులును గుర్తించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులతోపాటు పైరు పిలకలు వేసి దుబ్బు చేసే సమయంలో పాము పొడ తెగులు ఎక్కువగా కనిపిస్తుందన్నారు. ఈ శిలీంధ్రం వల్ల కాండంపై ఉండే కాడల మీద పాము పొడ వంటి మచ్చలు ఏర్పడి, ఇవి క్రమేపీ ఒకదానితో ఒకటి కలిసి మొత్తం ఆకులు, వరి మొక్క ఎండిపోతాయన్నారు. మచ్చ చుట్టూ గోధుమ రంగు ఉండి, మధ్యలో బూడిద రంగు ఉంటుందని చెప్పారు. వరిలో పాము పొడ తెగులును గమనించిన వెంటనే ప్రొపికొనజోల్ 1 మీ.లీ ఒక లీటరు నీటికి, లేదా హెక్సాకొన జోల్ 2 మీ.లీ ఒక లీటరు నీటికి లేదా వాలిడామైసిన్ 2 మీ.లీ ఒక లీటరు నీటికి చొప్పున ఉధృతిని బట్టి 15 రోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు పిచికారీ చేసుకోవాలన్నారు. సమగ్ర యాజమాన్య చర్యల ద్వారా పాము పొడ తెగులు బారి నుంచి పంటను కాపాడుకోవాలని సూచించారు.



ఆర్‌కేజీపాలెంలో పొలం పిలుస్తోంది..

అచ్చంపేట :
అచ్చంపేట మండలంలోని రోకటి గుంట వారి పాలెంలో నందు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని స్థానిక వ్యవసాయ అధికారి పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో మిరప పంటలో నల్ల తామర పురుగుల వల్ల ఎక్కువగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. నివారణకు వేపనూనె పిచికారీ చేయాలని, నీలి రంగు జిగురు అట్టలు పొలంలో 15 నుంచి 20 వేలాడ దీయాలని తెలిపారు. తెల్లదోమ నివారణకు పసుపు రంగు జిగురు అట్టలు వాడాలని సూచించారు.

కంది పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి..

వినుకొండ: వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నడిగడ్డ, దొండపాడు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి కె.అంజిరెడ్డి నిర్వహించారు. కంది, వరి, మిరప పంటలను క్షేత్ర సందర్శన చేసి, రైతులతో సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ కంది పంటలో శనగ పచ్చ పురుగు ఉధృతి ఉందని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.



మిర్చి పంటల పరిశీలన

వెల్దుర్తి : మండలంలోని మండాది, ఉప్పలపాడు, బోదెల వీడు గ్రామాల్లోని మిరప పంట పొలాలను మాచర్ల ఉద్యాన అధికారి సురేష్ పరిశీలించారు. పలు సూచనలు చేశారు.

పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది..

చిలకలూరిపేట : మండల పరిధిలోని ఎడవల్లి, కట్టుబడివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పల్నాడు జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివ కుమారి మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

ప్రజాశక్తి- నకరికల్లు
సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మొదటి విడత బ్యాచ్‌కు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కాశయ్య మాట్లాడుతూ గ్రామాలలో సుస్థిరాభివృద్ధి కోసం తొమ్మిది సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీర్ అసిస్టెంట్లకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ అభివృద్ధి అధికారి రాజగోపాల్, కెవిఎస్ ప్రసాద్, ఏఈ తస్లీమా, హెల్త్ సూపర్వైజర్ టి.శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆనంద్ కుమార్, ఏటీఎం జె.సమాధానం, పంచాయతీ కార్యదర్శులు మమత, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కాశయ్య

అభివృద్ధి ప్రణాళికలో ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలి

సత్తెనపల్లి రూరల్: గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికల్లో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని సత్తెనపల్లి ఎంపీడీఓ బి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. మండల ప్రజా పరిషద్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డీ ఎ.శ్రీనివాసరెడ్డి, జిల్లా రిసోర్స్ పర్సన్ నరసింహానాయక్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏఈ భావన తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తే ఉద్యమిస్తాం..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
ట్రూ అప్ చార్జీల పేరిట పెంచిన విద్యుత్ బిల్లులను కూటమి ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని ఎంసిపిఐయు నాయకులు రెడ్ బాషా డిమాండ్ చేశారు.ఈ మేరకు నరసరావుపేట ఆర్డీఓ కార్యాలయం వద్ద మంగళవారం ఎంసిపిఐయు, ఏఐకెఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రెడ్ బాషా మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించి నగదు బదిలీ పథకం ప్రతిపాదనలను విరమించుకోవాలన్నారు.సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని, అదానీపై కేసు పెట్టి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు.

పదోతరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - రెంటచింతల
మార్చిలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని.. ఆ ప్రకారం ప్రణాళికలు రూపొందించుకోవాలని మాచర్ల బీసీ సంక్షేమ సహాయ అధికారి ఎం.దయాకర్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక బిసి బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పదో తరగతి చదివే 38 మంది బాలికలకు పలు సూచనలు చేశారు. ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. వార్డెన్ సుశీల, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- మాచర్ల :
మానవహక్కులను కొన్ని దేశాల నాయకులు ఉక్కుపాదంతో అణిచివేస్తున్నారని హుజన భీమ్ సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జార్జి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏపీ స్టేట్ గవర్నమెంట్ పెన్షన్ అసోసియేషన్ భవన నందు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జార్జి మాట్లాడుతూ ముఖ్యంగా ఇజ్రాయెల్-పాలస్తీనా, రష్యా- ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధాల నేపథ్యంలో మానవ హక్కులు పూర్తిగా హరించబడ్డాయన్నారు. మన దేశంలో హక్కులకు భంగం కలిగించేవారిని కఠినంగా శిక్షించాలన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషనర్‌లో పెండింగ్‌లో ప్రతి ఒక్క సమస్యను త్వరతగతిన పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు.
ఈ కార్యక్రమంలో డప్పు మరియు జానపద కళాకారులరాష్ట్ర అధ్యక్షులు ఆది రాల ఆదాము, మాచర్ల రామారావు, కుక్క ముడి జాన్, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ ఫుడ్ అందజేత

ప్రజాశక్తి - వినుకొండ
వినుకొండ నియోజకవర్గం టి. ఎన్. టి. యు. సి అధ్యక్షులు షేక్ అక్బర్ బాషా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాల నందు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ మరియు డాక్టర్ అబ్దుల్ రజాక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనరు సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెచ్ఐవి పట్ల అవగాహన కలిగి ఉండాలని హెచ్ఐవి తో జీవిస్తున్న పిల్లలకు సమాజం తోడుగా ఉండాలని సూచించారు. చిన్నారుల పట్ల వివక్షత చూపకుండా వారిని సమాజంలో ఒకరిగా గుర్తించాలని అన్నారు. చిన్నారులు ప్రతి రోజు క్రమం తప్పకుండా మెడిసిన్ తీసుకోవడం వలన వ్యాధి నిరోధక శక్తి పెరిగి తమ యొక్క జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని అన్నారు. ఎవరైతే వ్యాధి రుగ్మతలతో బాధపడుతున్నారో వారికి తమ సహాయాన్ని అందజేస్తానని మరియు ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ అక్బర్ బాషా మరియు వారి మిత్రబందం లను ఆదర్శంగా తీసుకొని పిల్లలకు తగిన సహాయం చేయవలసినదిగా కోరారు.

ఇంటింటికీ క్యాన్సర్ పరీక్షలు

ప్రజాశక్తి - రెంటచింతల
చాప కింద నీరుల విస్తరిస్తున్న క్యాన్సర్ మహమ్మారిని నిర్మూలించడానికి ప్రతి ఇంటికి వెళ్లి పరీక్షలు నిర్వహించాలని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ పద్మావతి ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు అనంతరం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన వారి కి పరీక్షలు చేయాలని ప్రత్యేక యాప్ డేటా ప్రకారం ప్రశ్నలు అడిగి సమాచారం రాబట్టాలన్నారు రక్త పరీక్షలు, మధుమేహం, హిమోగ్లోబిన్ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని సూచించారు గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న సేవలు, అంగన్వాడి పిల్లల ఆరోగ్య పరీక్షల రిపోర్టులను పరిశీలించారు.

రేపు డయల్ యువర్ డీఎం

ప్రజాశక్తి-చిలకలూరిపేట
స్థానిక ఆర్టీసీ డిపో వద్ద గురువారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఎస్.రాంబాబు తెలిపారు. చిలకలూరిపేట పరిధిలో గల చిలకలూరిపేట, నాదెండ్ల, ఎడ్లపాడు ప్రజలు ఆర్టీసీ బస్సులకు సంబంధించి సలహాలు, సూచనలు అందజేయాల్సిందిగా కోరారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫోన్ 99592 25427 నంబరును సంప్రదించాలని కోరారు.

వార్డుల్లో చైర్‌పర్సన్ పర్యటన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక 25వ వార్డులో నెలకొన్న మురుగు సమస్యలను తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మంగళవారం పరిశీలించారు. పారిశుధ్య పనులపై సిబ్బందికి తగిన సూచనలు చేస్తూ, కాలువల్లో పేరుకుపోయిన షిల్ట్ తీయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య, సహాయ కమిషనర్ లక్ష్మీపతిరావు, మున్సిపల్ ఆరోగ్య అధికారి కె.హెలెన్ నిర్మల, సహాయ ఇంజినీరు బి.సునీల్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

13న ఓపెన్ ఫోరం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఈ నెల 13 నుంచి ప్రతి శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలసి ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నట్లు తెనాలి పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు టౌన్ ప్లానింగ్ విభాగంలో ఫోరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఫోరంలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన భవన నిర్మాణ అనుమతులు, ఇతర సమస్యలను పరిశీలించి సత్వర పరిష్కారం చేస్తామని తెలిపారు. భవన నిర్మాణ యజమానులు, లైసెన్సుడు సర్వేయర్లు, పట్టణ ప్రణాళిక అంశాలకు సంబంధించి ఓపెన్ ఫోరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చిరస్మరణీయుడు.. చెన్నుపాటి లక్ష్మయ్య

ప్రజాశక్తి-చేబ్రోలు

ఉపాధ్యాయ ఉద్యమనేత చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి కార్యక్రమాన్ని పొన్నూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలాలి మాస్టారు మాట్లాడుతూ.. చెన్నుపాటి లక్ష్మయ్య తన జీవితమంతా ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడిన యోధుడు అని కొనియాడారు. యూటీఎఫ్ పొన్నూరు ప్రధాన కార్యదర్శి ఎండీ ఇర్షాద్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా ప్రస్థానం ప్రారంభించిన లక్ష్మయ్య.. ఉపాధ్యాయుల హక్కుల కోసం అన్ని యూనియన్లనూ ఏకతాటిపైకి తీసుకొచ్చి అవిశ్రాంతంగా కృషి చేశారని గుర్తు చేశారు. సంఘ నిర్మాణంలో ఆయన పాత్ర ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో, శ్రీదేవి, శ్రీకాంత్, సీఐటీయూ పొన్నూరు మండల కార్యదర్శి నిమ్మకూరి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లంక భూముల సాగుదారులకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని పెద్దకొండూరు గ్రామానికి చెందిన లంక భూముల సాగుదారులకు పట్టాలు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నవ నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పెద్ద కొండూరు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు ఐ.సునీతకు అర్జీ అందించారు. కొన్నేళ్లుగా ఇక్కడ భూములను సాగు చేస్తున్నప్పటికీ పట్టాలు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు, రాయితీలు, వైపరీత్యాల సమయంలో నష్టపరిహారానికి నోచుకోలేకపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతులు దాసరి విజయలక్ష్మి వెరివేల ధనుంజయ్, వెంకటేశ్వరరావు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

➤ ఏపీఎస్పీ డీఐజీ రాజకుమారి

ప్రజాశక్తి-మంగళగిరి

శారీరక దారుఢ్యానికే కాక.. మానసిక ఒత్తిళ్లను దూరం చేసుకోవడానికి క్రీడలు దోహదపడతాయని ఏపీఎస్పీ డీఐజీ డి.రాజకుమారి అన్నారు. సోమవారం మంగళగిరి ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్‌లో 34వ క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం పనిఒత్తిడితో సతమతమవుతున్న ఉద్యోగులకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. ఏపీఎస్పీ చీఫ్ సీహెచ్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలను మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. క్రీడా ప్రాంగణంలో సెవెంత్ కమాండర్స్ నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



కార్యక్రమంలో మావిరెడ్డి ప్రతాప్ ఆరవ బెటాలియన్ కమాండర్ నగేష్ బాబు, ఆక్టోపస్ ఎస్పీ రవిచంద్ర, అడిషనల్ కమాండెంట్ డి.ఆశీర్వాదం, బెటాలియన్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో జెస్సీరాజ్ సత్తా

ప్రజాశక్తి- మంగళగిరి

62వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌లో మంగళగిరి క్రీడాకారిణి మాత్రపు జెస్సీ రాజ్ సత్తా చాటింది. తమిళనాడు రాష్ట్రం పోలాచి నగరంలోని కేశవ విద్యా మందిర్ స్కేటింగ్ పార్క్‌లో స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు పోటీలను నిర్వహించింది. దేశవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. 14 - 17 వయసు విభాగం సోలో డాన్స్‌కు జెస్సీరాజ్ ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించింది. రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సొంతం చేసుకుంది. జెస్సీ రాజ్ మంగళగిరిలోని విక్టరీ స్కేటింగ్ అసోసియేషన్ రింక్ వద్ద కొన్నేళ్లుగా శిక్షణ పొందుతోంది.



జాతీయ పతకం సాధించిన ఆమెను ఆర్టిస్టిక్ ఇండియన్ చైర్మన్ ప్రదీప్ మాల్వాయి, ఆంధ్రప్రదేశ్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ అసోసియేషన్ చైర్మన్ ఆకుల ప్రవీణ్ కుమార్, రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి తామస్ చౌదరి, సీనియర్ కోచ్ సింహాద్రి అభినందించారు. ఈ పతకంతో జెస్సీ రాజ్ 50 పతకాల మైలురాయిని చేరుకుంది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేయవద్దు : ఏఎస్పీ రవికుమార్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సైబర్ నేరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని గుంటూరు జిల్లా అదనపు ఎస్పీ ఏటీవీ రవికుమార్ తెలిపారు. ప్రధానంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేయవద్దని విద్యార్థులకు హితవు పలికారు. ఆత్మకూరులోని నిర్మల ఫార్మసీ కళాశాలలో సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్ ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియాలో వచ్చే ఫోన్ కాల్స్ లింకులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రైనీ డీఎస్పీ ఎం.ఎం.భార్గవి, మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు, రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి, ప్రిన్సిపల్ డాక్టర్ బి.పాముల్ రెడ్డి, యాంటీ ర్యాగింగ్ కమిటీ కోఆర్డినేటర్ ఎస్.జ్యోతి, సాయిలక్ష్మి, శాంత తదితరులు పాల్గొన్నారు.



చికెన్ స్టాల్ అసోసియేషన్ ఏర్పాటు

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణ చికెన్ స్టాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. బైపాస్ రోడ్ లోని సూర్య రెసిడెన్సీలో షేక్ బాజీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్పొరేషన్ అధికారులు వసూలు చేస్తున్న ఆసీలును ఎత్తివేయాలని, బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని సమావేశం తీర్మానించింది. అధ్యక్షులుగా ఎస్.కె.బాజీ, ఉపాధ్యక్షులుగా మేషయ్య, కార్యదర్శి వెంకయ్య, సహాయ కార్యదర్శిగా విజయ్, కోశాధికారిగా అక్రమ్, సహాయ కోశాధికారిగా యేసురత్నం, కార్యనిర్వాహక సభ్యులుగా గోపి, ఎం.రూపేష్, ఆర్ శ్రీను, రాబర్ట్, వి.శ్రీను, డి.శ్రీను, బాజీ, సద్దాం హుస్సేన్ తదితరులు ఎన్నికయ్యారు. సిఐటియు సీనియర్ నాయకులు రాఘవులు, ఎం.బాలాజీ పాల్గొన్నారు.

ధాన్యం రైతుల ఇబ్బందులు పట్టవా?

➤ వైసిపి జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు

➤ గుండిమెడ, చిర్రావూరు గ్రామాల్లో పర్యటన

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

రైతుల వద్ద నుంచి తక్షణం ధాన్యం కొనుగోలు చేయాలని గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు అంబటి రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడ, చిర్రావూరు గ్రామాల్లో స్థానిక వైసీపీ నాయకులతో కలిసి పర్యటించారు. ధాన్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద నుంచి పది శాతం మాత్రమే ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. దళారులు రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తూ దగా చేస్తున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు అధికారులను అడుగుతుంటే.. నాలుగు రోజులు ఆగాలని వారు చెప్పడం దుర్మార్గమన్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం.. వారిని ఇబ్బంది పెట్టడం భావ్యం కాదన్నారు. అన్నదాతల పక్షాన నిలిచిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకూ రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి, గెలిచిన తర్వాత మోసగించారని ఎద్దేవా చేశారు. ఈ నెల 13న రైతాంగ సమస్యలపై జిల్లాలో భారీ ర్యాలీ చేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల చినరాజప్ప, మంగళగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, తాడేపల్లి మండల అధ్యక్షులు అమర నాగయ్య, ఇతర నాయకులు మేకల సాంబశివరావు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న అంబటి

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి- మేడికొండూరు

గ్రామాల్లో రైతులకు భూ సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సుల్లో వెంటనే పరిష్కరిస్తామని మేడికొండూరు తహసీల్దార్ హరిబాబు అన్నారు. మండల పరిధిలోని పేరేచర్లలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పొలాలు విస్తీర్ణం, కొలతలలో హెచ్చు తగ్గులు, డాక్యుమెంట్లలో పేర్లు తప్పులు, కొత్త పాస్ పుస్తకాలు వంటి సమస్యలను సదస్సుల దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై రైతులు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యులు పాములపాటి శివన్నారాయణ, పేరేచర్ల ఎంపీటీసీ సభ్యులు పాములపాటి సురేష్, ఏఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్‌లో రాణిస్తున్న కొర్రపాడు విద్యార్థులు

ప్రజాశక్తి -మేడికొండూరు

మండలంలోని కొర్రపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర, జాతీయ, యూనివర్సిటీ స్థాయిలో విద్యార్థులు సత్తా చాటుతున్నారని మేడికొండూరు మండల ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మొఖారాల శ్రీనివాసరావు, కార్యదర్శి బ్రహ్మాజీ తెలిపారు. మంగళవారం కొర్రపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో క్రీడాకారుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్లలో మేడికొండూరు మండలం నుంచి 50 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, యూనివర్సిటీ స్థాయిలో సత్తా చాటారని చెప్పారు. మరింత మందిని సానబెట్టేందుకు వేసవి శిక్షణా కేంద్రాలు నిర్వహిస్తామని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శివకుమార్, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాటూరి శిల్పశాలలో రూపుదిద్దుకోనున్న అనుగురాజు విగ్రహం

ప్రజాశక్తి- తెనాలి రూరల్

టిటిడి పాలకవర్గ సభ్యులు, జంగా కృష్ణమూర్తి మంగళవారం తెనాలి సూర్య శిల్పశాలను సందర్శించారు. ఫైన్ ఆర్ట్స్ రంగంలో తమదైన శైలిని సృష్టించుకున్న కాటూరి బ్రదర్స్ రవిచంద్ర, శ్రీహర్ష చేతులమీదుగా రూపుదిద్దుకున్న పలు విగ్రహాలను పరిశీలించారు. పల్నాడు ప్రాంతాన్ని పరిపాలించిన అనుగు రాజు విగ్రహ తయారీ బాధ్యతలను శిల్పశాల వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరరావుకు అప్పగించారు. అనుగు రాజు 9 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని 2025 మార్చి నాటికి పల్నాడులో ప్రతిష్టించనున్నట్లు జంగా కష్ణ మూర్తి తెలిపారు.

సుస్థిరాభివృద్ధిపై శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి- పెదనందిపాడు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు మంగళవారం పెదనందిపాడు ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతోపాటు.. సచివాలయ సిబ్బందికి వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో గుంటి లక్ష్మీదేవి మాట్లాడుతూ.. పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు కలిగిన గ్రామాలు, ఆరోగ్యవంతమైన సమాజం, బాలహిత, సమృద్ధిగా నీరు, పచ్చదనం పరిశుభ్రత, మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం, భద్రత, సుపరిపాలన, మహిళా స్నేహపూర్వక గ్రామాలు తదితర అంశాలపై మూడు రోజులపాటు అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈవోపీఆర్డీ వరూధిని, సూపరింటెండెంట్ కె.స్వామి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పిజి సెట్‌లో ర్యాంకర్లకు నేడు అభినందన సభ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పీజీ సెట్ ద్వారా ప్రతి డిపార్ట్మెంట్లో మొదటి రెండు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బుధవారం అభినందన సభ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ వర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు రూపస్, నవిత పేర్కొన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ తదితరులు మీడియాతో మాట్లాడారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, రిజిస్ట్రార్ జి సింహాచలం తదితరులు పాల్గొంటారని తెలిపారు. వర్సిటీ కామర్స్ విభాగంలోని సెమినార్ హాల్లో ఉదయం 11 గంటలకు వర్సిటీ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనాలని వారు కోరారు.


మీడియాతో మాట్లాడుతున్న కిరణ్ తదితరులు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న విసి ఆచార్య కె గంగాధరరావు తదితరులు

20న ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, ది అసోసియేషన్ ఆఫ్ చార్టెడ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఏసిసిఎ)లు సంయుక్తంగా ఈనెల 20న ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి, డీన్ ఆచార్య ఆర్ .శివ రాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఇన్చార్జి వీసీ ఆచార్య కే. గంగాధరరావు తదితరులు సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ స్టాండర్డ్స్ అనే అంశంపై సదస్సును నిర్వహిస్తున్నట్లు శివరాం ప్రసాద్ తెలిపారు.సదస్సుకు రిసోర్స్ పర్సన్స్ గా ముంబైలోని ఎ సి సి ఎ నుంచి జాకీర్ ఎ .సయ్యద్, చెన్నై నుంచి కె. రాయిస్టన్ ఎబినేజర్ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి రెక్టార్ ఆచార్య కే. రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తదితరులు పాల్గొన్నారు. పేర్కొన్నారు.



విన్నర్స్ ట్రోఫీని అందుకుంటున్న కృష్ణవేణి కాలేజి జట్టు

ఆర్‌విఆర్‌లో ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-గుంటూరు

క్రీడా రంగంలో దేశ కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో చాటే విధంగా క్రీడాకారులు తయారవ్వాలని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. ఆర్‌విఆర్‌లో రెండ్రోజులుగా జరుగుతున్న ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ ఇంటర్-కాలేజియేట్ వాలిబాల్ మెన్ టోర్నమెంట్ పోటీలు మంగళవారం ముగిసాయి. నరసరావుపేట కష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు, బాపట్ల ఇంజినీరింగ్ కాలేజి జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో కష్ణవేణి కాలేజి జట్టు మొదటి స్థానంలో నిలిచి విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది, బాపట్ల ఇంజినీరింగ్ కాలేజి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రన్నర్స్ ట్రోఫీని కైవసం చేసుకుంది. తతీయ స్థానంలో ఏఎన్‌యు కాలేజీ అఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు, నాలుగో స్థానంలో ధనలక్ష్మి కాలేజీ అఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు నిలిచి ట్రోఫీలను అందుకున్నారు. ఉత్తమ నైపుణ్యం చూపిన క్రీడాకారులతో ఏఎన్‌యు వాలీబాల్ జట్టును ఎంపిక చేసి, కేరళ యూనివర్సిటీలో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌కు పంపన్నుట్లు వర్సిట అబ్జర్వర్, సెలక్షన్ కమిటీ సభ్యులు ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శీనివాస్, వర్సిటీ ఆబ్సర్వర్ డాక్టర్ సూర్యనారాయణ, సెలక్షన్ కమిటీ సభ్యులు పాతూరి శ్రీనివాస్, జె. ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోసిల్‌ను సందర్శించిన హిందూ ఫార్మసీ విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఫార్మాసుటికల్ ఎనాలిసిస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జోసిల్ పరిశ్రమను సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలియచేశారు. ఈయాత్రలో కళాశాల ఎం.ఫార్మసీ, డి.ఫార్మసీ, ఫార్మా డి విద్యార్థులు పాల్గొన్నారన్నారు. విద్యార్థులు జోసిల్ పరిశ్రమలలో గోద్రెజ్, లిరిల్, లక్స్ వంటి వివిధ రకాల సబ్బులు, ఇతర రసాయన పదార్థాలు తయారు చేసే విధానాన్ని తెలుసుకున్నారన్నారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ పి.నాగరాజు, శ్రీమతి వి. సుధారాణి ఈ కార్య క్రమాన్ని పర్యవేక్షించారు.



బాలల సంపూర్ణ ఆరోగ్యరక్ష వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

వైద్య ఆరోగ్య శాఖకు చెందిన బాలల సంపూర్ణ ఆరోగ్యరక్ష వాహనాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం కలెక్టర్ ప్రాంగణంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమములో భాగంగా స్క్రీనింగ్ చేయబడి, గుంటూరులోని ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రానికి రిఫర్ చేసిన పిల్లలను తరలించటానికి ప్రభుత్వం బాలల సంపూర్ణ ఆరోగ్యరక్ష వాహనాన్ని కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు, జిల్లా క్షయ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ దాసరి. శ్రీనివాసులు, డిప్యూటీ డియంహెచ్ఒ డాక్టర్ ఇ.అన్నపూర్ణ, ఆర్‌బియస్‌కె కో ఆర్డినేటర్ డాక్టర్ జయరామకష్ణ, డిఎన్‌యంఓ డాక్టర్ లక్ష్మనాయక్, డెమో ఏ. జయప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

బాల్య వివాహాల నిషేధ కమిటీలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో వార్డుల వారీగా ఏర్పాటు చేసిన బాల్య వివాహాల నిషేధం, పర్యవేక్షణ కమిటీలు అప్రమత్తంగా ఉంటూ, ఒక్క బాల్య వివాహం కూడా చూడాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సిహెచ్.విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో బాల్య వివాహాల నిషేధ కమిటీలకు బాల్య వివాహ నిషేధ చట్టం-2006, రూల్స్ 2023పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ వార్డుల వారీగా కార్పొరేటర్ చైర్‌పర్సన్‌గా, ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శి కన్వీనర్‌గా, అడ్మిన్, విఆర్ఓ, స్థానిక స్కూల్ హెచ్‌ఎం, స్వయం సహాయక సభ్యులు, ఏఎన్‌ఎం, అంగన్వాడీ వర్కర్, ఎన్జీఓ ప్రతినిధులు సభ్యులుగా బాల్యవివాహాల నిషేధం, పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయా కమిటీలు ప్రతినెలా సమావేశమై, కౌమార బాలల జాబితాలు, దీర్ఘకాలంగా స్కూల్‌కి హాజరు కాని వారి వివరాలతో జాబితాలు తయారు చేయాలన్నారు. అన్ని సచివాలయాలు, సంస్థల్లో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ 100, ఉమెన్ హెల్ప్ లైన్ 181, ఈఆర్‌ఎస్‌ఎస్ 112 నంబర్లను ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో జిఎంసి డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఉపా సెల్ పిఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజయ్‌కుమార్

రోలర్ స్కేటింగ్‌లో బి.ఆర్ స్టేడియం క్రీడాకారులకు పతకాలు

ప్రజాశక్తి-గుంటూరు

రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 5 నుండి 7వ తేదీ వరకూ జరిగిన 62వ జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరు జిల్లా నుండి క్రీడాప్రాధికార సంస్థ బి.ఆర్ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు పతకాలు సాధించారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి తెలిపారు. యండి. మీర్జా అబ్దుల్ సలాం ఇన్‌లైన్ హాకీలో, జె.గౌతం విశ్వాస్ పిన్క్ బాల్ హాకీలో రజత పతకాలు సాధించారన్నారు. వీరికి బి.ఆర్ స్టేడియం స్కేటింగ్ కోచ్ అబ్దుల్ సలాం శిక్షణ ఇచ్చాడన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, కోచ్‌ను నరసింహారెడ్డి అభినందించారు.


క్రీడాకారులు, కోచ్‌ను అభినందిస్తున్న డిఎస్‌డిఒ

జిఎంసికి కేంద్ర కార్యాలయాల బకాయి రూ.32 కోట్లు

సర్వీసు ఛార్జీల వసూలుకు చర్యలు తీసుకోవాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు జిఎంసికి చెల్లించాల్సిన సర్వీస్ చార్జీలను సత్వరమే చెల్లించాలని నగర కమిషనర్ పులి శ్రీని వాసులు అన్నారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో నగరంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన సర్వీస్ చార్జీల వసూళ్లపై ఆయా డిపార్ట్మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుండి షుమారు రూ.32 కోట్లు సర్వీస్ చార్జీలు బకాయిలు ఉన్నాయని, ఆయా శాఖలు బకాయిలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలంగా చెల్లించాల్సిన సర్వీస్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, బకాయిల వివరాలను ఆయా సంస్థల ప్రతినిధులకు అందించి, ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్ళి చెల్లించాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు బాలాజీ బాష, రెహ్మాన్, సాదిక్ భాష తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

విజ్ఞాన్స్ వీసీకి ఎన్‌సీసీలో గౌరవ కల్నల్ ర్యాంక్

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్‌కు న్యూఢిల్లీలోని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ వారు ఎన్‌సీసీ విభాగంలో గౌరవ కల్నల్ ర్యాంక్‌ను అందించింది. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను, గెజిట్ నోటిఫికేషన్‌ను ఏపీ-తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ డైరెక్టరేట్ డెప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమోడర్ వి.మధుసూదన్‌రెడ్డి మంగళవారం వర్సిటీలో వీసీకి అంద చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీ అకడమిక్ ఫ్రేమ్‌వర్క్‌లో ఎన్‌సిసిని ఏకీకతం చేయడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచి విద్యార్థుల్లో క్రమశిక్షణ, స్నేహభావం, నిబద్ధత, సమగ్ర అభివృద్ధికి చేస్తున్న కషికిగాను వీసీకి ఈ ర్యాంకును అందించామన్నారు. వర్సిటీలో ఎన్‌సీసీ కార్యకలాపాలను ఎక్కువగా నిర్వహించటంలో ఆయన విశేషమైన కృషి చేశారన్నారు. ఎన్‌సిసి, ఎన్‌సిసి యేతర క్యాడెట్‌లకు 20 క్రెడిట్‌లను అందించే ఎన్‌సీసీ మైనర్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టడం ఆయన సాధించిన విజయాలలో అతి ముఖ్యమైనదన్నారు. ఎన్‌సీసీ ట్రైనింగ్ ప్రాముఖ్యతను గుర్తిస్తూ అకడమిక్ కరిక్యులమ్‌లో ఇంటిగ్రేటెడ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తోపాటు ఎస్ఎస్‌బీ ట్రైనింగ్‌ను ఎన్‌సీసీ మైనర్‌కోర్సులో విలీనం చేశారన్నారు. ఈయన నాయకత్వంలో కఠినమైన శిక్షణ, క్యాడెట్‌లలో క్రమశిక్షణ, స్నేహ భావాన్ని పెంపొందించడం కోసం విశ్వవిద్యాలయంలో క్యాంపుల నిర్వహణకు అనువైన వాతావరణం ఏర్పాటుకు కషి చేశారని వెల్లడించారు. అనంతరం ప్రొఫెసర్ పీ.నాగభూషణ్‌కు కల్నల్ సంజయ్ గుప్త, గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ఎం.చంద్రశేఖర్, ఇతర గ్రూప్ కమాండర్లు, బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్స్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు అభినందనలు తెలిపారు.


ర్యాంక్ సర్టిఫికెట్‌ను అందచేస్తున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు